


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

05.08.2026

బుధవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 36

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## తప్పుగా మాట్లాడలేదు

- డీఎంకే నేత ఉదయ నిధి
- నేను విజయ్ పేరు తప్ప వేరే ఎవరి పేరూ ఎత్తలేదు
- త్రిషపై డబుల్ మీనింగ్ కామెంట్స్!
- పోలీసుల అదుపులో ఉదయనిధి స్టాలిన్



2లో..

చెన్నై, ఆగస్టు 04, అనంతజనశక్తి న్యూస్

తమిళనాడు రాజకీయం ఒక్కసారిగా తీవ్ర దుమారంతో వేడెక్కింది. కావేరి జలాల వివాదంపై అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో ప్రతిపక్ష నేతఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంచలనానికి దారితీశాయి. ప్రముఖ సినీ నటి త్రిషను, ముఖ్యమంత్రి విజయ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన డబుల్ మీనింగ్ కామెంట్స్ తీవ్ర కలకలం రేపాయి. ఈ వ్యవహారంలో ఉదయనిధిపై కేసు నమోదు అయ్యింది.

## వైగై నది కంటే ఎక్కువ కాలుష్యం

- త్రిషపై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు
- కౌంటర్ ఇచ్చిన అన్నామలై

చెన్నై, ఆగస్టు 04, అనంతజనశక్తి న్యూస్

తమిళనాడులో రాజకీయ వాగ్వాదం మరింత ముదురుతోంది. డీఎంకే నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అన్నామలై ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.



2లో..

## 'రాజీనామా' లెటర్లు ఇస్తే నిమిషాల్లో ఆమోదిస్తా


- అసమ్మతిపై డీకే. శివకుమార్ హెచ్చరిక
- కేబినెట్ విస్తరణ తర్వాత అసంతృప్తి
- రాజీనామా చేస్తామంటూ సీనియర్లు బెదిరింపులు

2లో..



## విద్యా వ్యవస్థను రేవంత్ నాశనం చేస్తున్నారు

- ఎంపీ అర్వింద్
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా..
- రేవంత్ మాట్లాడుతున్నారని ఆగ్రహం



2లో..

హైదరాబాద్, ఆగస్టు 04, అనంతజనశక్తి న్యూస్

ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో టీఫైబర్ ద్వారా ఇంటర్నెట్

సెప్టెంబర్ 1 నుంచి..

మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు జారీ

ప్రైవేట్ నెట్ సేవలకు గుడ్‌బై

అన్ని శాఖలు టీ-ఫైబర్‌కే


టి-స్వాన్‌కు పూర్తి విరామం

ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ లక్ష్యం

ఫ్యూచర్ సిటీకి హైటెక్ కనెక్టివిటీ

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్‌కు వేగం

డిజిటల్ తెలంగాణపై శ్రీధర్ బాబు ఫోకస్



2లో..

హైదరాబాద్, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి ఇంటర్నెట్ సేవలను కేవలం టీ-ఫైబర్ ద్వారానే అందించేలా చూడాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. టీ-ఫైబర్ సేవల విస్తరణకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశిత కాలపరిమితిలోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

అంతేకాకుండా సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగించుకోకూడదని, వాటికి బిల్లులు చెల్లించకూడదని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రభుత్వ నిధులను ఆదా చేయడం, ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ శాఖలు ఉపయోగిస్తున్న టిస్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెలలోగా పూర్తిగా టిఫైబర్‌కు మార్చాలని శ్రీధర్ బాబు అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియ ఎలాంటి జాప్యం లేకుండా సాగేలా చూడాలని వారిని ఆదేశించారు.

అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రాబోయే 'ఫ్యూచర్ సిటీ'కి అత్యాధునిక టిఫైబర్ కనెక్టివిటీని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చూడటానికి, ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ప్రతి ఇంటికీ ఇంటర్నెట్' పథకాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. అధికారులందరి సమన్వయ కృషి అవసరాన్ని నొక్కి చెబుతూ, గడువులోగా తమ లక్ష్యాలను చేరుకుని, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ ఉన్న రాష్ట్రంగా మార్చాలని ఆయన అధికారులను కోరారు.

## ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు

- మోదీపై అభ్యంతరకర పోస్టులా?
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- డీసీపీని రేవంత్ రెడ్డినే బదిలీ చేశారు

2లో..



హైదరాబాద్, ఆగస్టు 04, అనంతజనశక్తి న్యూస్

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని తెలిపారు.

## మంత్రి లోకేష్‌తో చాగంటి భేటీ

- నైతిక విలువలతోనే విద్యా వికాసం
- పిల్లలలో మానవీయ విలువలు పెంపొందించాలి
- క్రమశిక్షణ, నైతికతను వివరించాలి

2లో..

అమరావతి, ఆగస్టు 04, అనంత జనశక్తి న్యూస్

ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉండవల్లిలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో చాగంటి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



## జల్ జీవన్ పనులలో వేగం పెంచాలి

- నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ఫోకస్ పెట్టాలి
- అధికారులను ఆదేశించిన పవన్
- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- త్వరలోనే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని వెల్లడి



అమరావతి, ఆగస్టు 04, అనంత జనశక్తి న్యూస్

ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టినఅమరజీవి జలధార ప్రాజెక్టుద్వారా.. తీర ప్రాంత గ్రామాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి జిల్లాల పరిధిలోని 33 లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు వివరించారు. ప్రాజెక్టు పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గోదావరి జిల్లాలలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్ష నిర్వహించిన పవన్ కళ్యాణ్.. నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, పనులలో వేగం పెంచాలని స్పష్టం చేశారు. 2లో..

## మెటా పాలసీ హెడ్‌కు కేంద్రం నోటీసులు

### ప్రధాని వీడియో అంశం వ్యవహారం

న్యూఢిల్లీ, ఆగస్టు 04, అనంతజనశక్తి న్యూస్

ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా కు కేంద్రం మరోసారి నోటీసులు ఇచ్చింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సందేశం పోస్టును ఫేస్‌బుక్ కొంత సమయం పాటు తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఇప్పటికే మెటాకు నోటీసులు ఇచ్చిన కేంద్రం.. తాజాగా మరోసారి ఆ సంస్థ పబ్లిక్ పాలసీ హెడ్ జో కాప్లన్‌కు సమన్లు జారీ చేసింది. బుధవారం అత్యున్నత స్థాయి ప్రతినిధులతో వచ్చి.. ప్రభుత్వ అధికారులతో చర్చలు జరపాలని మెటాను కోరినట్లు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2లో..

## తెలంగాణ మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్ 2లో..



హైదరాబాద్, ఆగస్టు 04, అనంత జనశక్తి న్యూస్

మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు.

## తెలుగుజాతి గర్వించేలా అమరావతి

- మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత
- 2028 నాటికి పూర్తి
- అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల నివాసాలు
- జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు



5లో..

# విద్యా వ్యవస్థను రేవంత్ నాశనం చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# మంత్రి లోకేష్‌తో చాగంటి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను నో బ్యాగ్ డే రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడం పట్ల చాగంటి కోటేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటి కోటేశ్వరరావుని వినయపూర్వకంగా సాగనంపారు మంత్రి నారా లోకేష్.

ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉండవల్లిలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో చాగంటి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను నో బ్యాగ్ డే రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడం పట్ల చాగంటి కోటేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటి కోటేశ్వరరావుని వినయపూర్వకంగా సాగనంపారు మంత్రి నారా లోకేష్.

# ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు.

**సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి..**

గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు.

**సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించాం..**

సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు PKOC బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్ 2, మణుగూరు PKOC బ్లాక్‌లను.. సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# జల్ జీవన్ పనులలో వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం వంటి పనులపై ఆరా తీసిన పవన్.. పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాలకు చెందిన 20 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే ఉద్దేశంతో.. మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,650 కోట్లు ఖర్చు అవుతుందనే అంచనాతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పనులలో రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. ఒక నీటి శుద్ధి కేంద్రం పనులు జరుగుతున్నట్లు అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు.మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.151 కోట్లకు పైగా ఖర్చు చేసిందని.. ఈ నిధులతో 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తైనట్లు తెలిపారు. ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి.. రూ.1,400 కోట్లతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ప్రాజెక్టు పనులకు సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ రెండు పథకాల కింద 400 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తైనట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో అమరజీవి జలధార ప్రాజెక్టు పనులు చేపట్టామన్న పవన్ కళ్యాణ్.. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## తెలంగాణ మత్స్యకారుల
# సంక్షేమానికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)



మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు.

పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# మెటా పాలసీ హెడ్‌కు కేంద్రం నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయనతో పాటు ఇన్‌స్టాగ్రామ్ సాంకేతిక అధికారులను కూడా పిలిచినట్లు తెలిపింది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కొన్ని ప్రభుత్వ వ్యతిరేక పోస్టులకు ఎక్కువ ఆదరణ లభిస్తోందని ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే మెటా అల్గారిథం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలని ప్రభుత్వం అనుకుంటుందన్నారు. అలాగే ప్రధాని మోదీ వీడియో తొలగింపునకు దారితీసిన సాంకేతిక లోపంపై లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత వారం మెటా ఉన్నతాధికారులతో జరిగిన సమావేశం తర్వాత.. ప్రధాని మోదీ పోస్టులకు భద్రతా ఏర్పాట్లు చేస్తామని మెటా బృందం హామీ ఇచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఇకపై ప్రముఖుల ఖాతాలపై అదనపు పర్యవేక్షణ ఉంటుందని సంస్థ తెలిపిందన్నారు.

విద్యార్థుల ఉద్యమంపై ఈ నెల 23న మోదీ వెలువరించిన మొదటి వీడియోను ఫేస్‌బుక్ తొలగించాక భాజపా కార్యకర్త ప్రీతీ గాంధీ 'ఎక్స్'లో అభ్యంతరం లేవనెత్తారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రధాని తన సెల్ఫీ వీడియోను అప్‌లోడ్ చేస్తే ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. దీంతో యూజర్ల గోప్యత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటో తెలపాలంటూ మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్‌లకు పార్లమెంటరీ స్థాయీసంఘం నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై మెటా స్పందిస్తూ.. అంశాల వడపోత ఆటోమేటిక్ విధానంలో సమస్యవల్ల ఇలా జరిగిందని స్పష్టతనిచ్చింది. అయినప్పటికీ 'మెటా' ఇచ్చిన వివరణతో ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీనిపై అత్యున్నత స్థాయి ప్రతినిధులతో వచ్చి వివరణ ఇవ్వాలని సంస్థను కోరుతూ సమన్లు జారీ చేసింది.

# తప్పుగా మాట్లాడలేదు

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడు పోలీసులు ఆయన్ని మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తనను తీసుకెళ్తున్న సమయంలో ఉదయనిధి స్పందిస్తూ.. "నేనేమీ తప్పుగా మాట్లాడలేదు. నేను విజయ్ పేరు తప్ప వేరే ఎవరి పేరూ ఎత్తలేదు. కావాలనే నాపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. దీనిపై కోర్టులోనే తేల్చుకుంటాను," అని పేర్కొన్నారు.

వివాదం ఎలా మొదలైందంటే..

కావేరి నీటి విడుదల విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రభుత్వం విఫలమైందంటూ తంజావూరులో డీఎంకే చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో సభలోని కొందరు వ్యక్తులు "త్రిష, త్రిష" అంటూ గట్టిగా నినాదాలు చేశారు. ఆ సమయంలో ప్రసంగాన్ని కాసేపు ఆపిన ఉదయనిధి, సదరు నినాదాలకు సమాధానంగా అభ్యంతరకర రీతిలో రెండు అర్థాలు వచ్చేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు మహిళలను తీవ్రంగా కించపరిచేలా, దిగజారుడు తనంతో ఉన్నాయంటూ తమిళనాడులోని అన్ని ప్రధాన రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా, తీవ్రంగా ఖండించాయి.

హైకోర్టును ఆశ్రయించిన ఉదయనిధి..

ఈ వివాదం చెలరేగిన వెంటనే పోలీసులు ఉదయనిధిపై కేసు నమోదు చేసి, చెన్నైలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ముందస్తు అరెస్టును తప్పించుకోవడానికి ఉదయనిధి స్టాలిన్ వెంటనే మద్రాస్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ విచారణకు వచ్చే ముందే, పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఉదయనిధిని అదుపులోకి తీసుకుంటున్న తరుణంలో ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం కనిపించింది. డీఎంకే నేతలు, కార్యకర్తలు ఉదయనిధి నివాసం వద్దకు భారీ సంఖ్యలో చేరి పోలీసులను ఇబ్బంది పెట్టే




ప్రయత్నం చేశారని తెలుస్తోంది.

'అశ్లీల నిధి' అని తీవ్ర విమర్శలు..

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై అధికార తమిళగ వెట్రి కళగం (టీవీక) తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఆ పార్టీ నేత ఆథవ్ అర్జున సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయనను "అశ్లీల నిధి" అని అభివర్ణించిన అర్జున, ఉదయనిధి రాజకీయ సంస్కృతిని దిగజార్చుతున్నారని ఆరోపించారు.

"గొప్ప తమిళ భాషా కోవిదుడైన అన్నాదురై ఎంతో శ్రమించి నిర్మించిన వ్యవస్థను, నేడు ఉదయనిధి తన అశ్లీల పదజాలంతో, ద్వంద్వార్థ ప్రసంగాలతో నాశనం చేస్తున్నారు. మహిళలపై ఆయనకున్న వికృత ఆలోచనలకు ఈ వ్యాఖ్యలే అద్దం పడుతున్నాయి. తమిళనాడులోని ఏ తల్లీ, చెల్లెలు, తల్లిదండ్రులు కూడా ఇలాంటి నీచమైన ప్రసంగాలను అంగీకరించరు. ఇప్పటికే మహిళలు డీఎంకేను తిరస్కరించారు, రాబోయే రోజుల్లో తమిళనాడు రాజకీయం నుంచే ఉదయనిధిని తుడిచిపెట్టడం ఖాయం," అని ఆథవ్ అర్జున అన్నారు. మరొకవైపు టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ మాట్లాడుతూ.. "ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలను ఉదయనిధి తన సొంత పిల్లల ముందు మాట్లాడగలరా?" అని ప్రశ్నించారు.

సమర్థించుకున్న డీఎంకే..

అయితే తమ నాయకుడి వ్యాఖ్యలను డీఎంకే సమర్థించుకుంది. మాజీ మంత్రి టీ మనో తంగరాజ్ ఈ వివాదంపై స్పందిస్తూ.. కావేరి నీటి సమస్య, డెల్టా రైతుల కష్టాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే అధికార పక్షం ఈ రకమైన కుట్రపూరిత రాజకీయాలకు దిగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న కీలక ప్రశ్నల నుంచి తప్పించుకోవడానికే ఉదయనిధి వ్యాఖ్యలను వక్రీకరించి రచ్చ చేస్తున్నారని ఆయన విమర్శించారు.

# వైగై నది కంటే ఎక్కువ కాలుష్యం

(మొదటి పేజీ తరువాయి)

వైగై నది శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత సోషల్ మీడియాలో స్పందించిన అన్నామలై.. ఉదయనిధి స్టాలిన్ ప్రసంగాన్ని వైగై నది కాలుష్యంతో పోలుస్తూ సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే ఈ వివాదంపై ట్వీట్ చేసిన అన్నామలై.. తాను నిన్న వైగై నదిని శుభ్రం చేశానని పేర్కొన్నారు.

అయితే వైగై నదిని శుభ్రం చేస్తుండగా అందులో ఉన్న కాలుష్యం కంటే ఘోరమైన కాలుష్యం ఇంకేముంటుందా అని అనిపించిందని పేర్కొన్న అన్నామలై.. ఆ తర్వాత ఉదయనిధి స్టాలిన్ చేసిన ప్రసంగాన్ని విన్నాను అంటూ ఎద్దేవా చేశారు. ఉదయనిధి స్టాలిన్‌పై అన్నామలై చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

మరోవైపు.. ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను తమిళనాడు మంత్రులు తీవ్రంగా ఖండించారు. రాజ్‌మోహన్, అధవ్ అర్జునా, ఆనంద్, అరుణ్‌రాజ్ వంటి మంత్రులు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ కూడా ఉదయనిధి స్టాలిన్ చేసిన ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ స్పందించారు. టీవీకే కార్యకర్తలు, నేతలు ఉదయనిధి స్టాలిన్ తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కావేరి జలాల సమస్యపై తంజావూరులోని పనగల్ భవనం ఎదుట డీఎంకే ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉదయనిధి స్టాలిన్.. 8 జిల్లాలకు చెందిన డీఎంకే కార్యకర్తలు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ప్రసంగంలో భాగంగానే తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఉదయనిధి స్టాలిన్.. ఆ సమయంలో డీఎంకే కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ చేసిన నినాదాల సమయంలో డబుల్ మీనింగ్ వచ్చేలా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి.

ఈ వ్యవహారంలో తంజావూరు పోలీస్ స్టేషన్‌లో టీఎంకే మహిళా విభాగం ఫిర్యాదు చేయగా.. ఇవాళ పోలీసులు ఉదయనిధి స్టాలిన్ ఇంటికి వెళ్లి అతడిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే డీఎంకే నేతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఉదయనిధి స్టాలిన్‌ను వెంటనే విడిచిపెట్టాలని పోలీసులను ఆదేశించింది.

# 'రాజీనామా' లెటర్లు ఇస్తే నిమిషాల్లో ఆమోదిస్తా



**బెంగళూరు, జులై 04, అనంతజనశక్తి న్యూస్**

కర్ణాటకలో కేబినెట్ విస్తరణ తర్వాత కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. మంత్రి పదవులు దక్కని పలువురు సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు పార్టీ పదవులకు రాజీనామా చేయగా.. మరికొందరు కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. ఎవరైనా రాజీనామా చేస్తే కొన్ని నిమిషాల్లోనే ఆమోదిస్తానని హెచ్చరించారు. అయితే అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడతానని కూడా తెలిపారు.

డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత సోమవారం కర్ణాటక మంత్రివర్గాన్ని పూర్తి స్థాయికి విస్తరించారు. కొత్తగా 20 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పీఎం నరేంద్రస్వామి, శివరాజ్ తంగడగి, రుద్రప్ప లమాణి, కేఎస్ బసవంతప్ప, బీ. నాగేంద్ర, టీ. రఘుమూర్తి, బీ.జెడ్. జమీర్ అహ్మద్ ఖాన్, రిజ్వాన్ అర్షద్, సంతోష్ లాడ్, మధు బంగారప్ప, పుట్టరంగశెట్టి, ఎస్ఎస్ మల్లికార్జున్, డాక్టర్ అజయ్ సింగ్, ఎన్. చలువరాయస్వామి, కేఎం శివలింగే గౌడ, హెచ్‌సీ బాలకృష్ణ, గాయత్రి శాంతేగౌడ, బసవరాజ్ రాయరెడ్డి, విజయానంద్ కాశప్పనవర్, లక్ష్మణ్ సవాది మంత్రులుగా ప్రమాణం చేశారు.

కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులకు డీకే శివకుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని కరవు ప్రభావిత ప్రాంతాలను వెంటనే సందర్శించాలని సూచించారు. మంగళవారం నుంచే అన్ని జిల్లాల్లో పర్యటించి కరవు పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కూడా సూచించినట్లు తెలిపారు.

''అన్ని మంత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను. రేపటి నుంచే కరవు ప్రభావిత ప్రాంతాల సందర్శన ప్రారంభించాలి. సమయాన్ని వృథా చేయకండి. అన్ని జిల్లాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించాలి. క్షేత్రస్థాయి పర్యటనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించాం. ప్రతి ఒక్కరూ ఈ పనిలో భాగస్వాములు కావాలి'' అని డీకే శివకుమార్ పేర్కొన్నారు.

మంత్రి పదవులు దక్కని నేతలు ఓపికగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. తన రాజకీయ జీవితంలో ఎదురైన అనుభవాలను గుర్తు చేస్తూ.. గతంలో తనకు కూడా మంత్రి పదవి దక్కని సందర్భాలు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ పార్టీని వీడకుండా ఓపికగా ఎదురుచూశానని తెలిపారు.

''రాజీనామా చేస్తామని చెబుతున్నవారంతా రాజకీయాలు చేస్తున్నారు. రాజీనామా చేయాలని నిర్ణయించుకున్న వారిని ఎవరూ అడ్డుకోలేరు. కానీ వారికి పార్టీ కూడా అవసరం.. రాజకీయ భవిష్యత్తు కూడా అవసరం. ఆ భవిష్యత్తు పార్టీతోనే ఉంటుంది. ధరం సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనైనా, ఇతర సందర్భాల్లోనైనా, సిద్ధరామయ్య హయాంలో కొందరు మంత్రులు నన్ను పక్కన పెట్టిన సమయంలోనైనా నేను రాజీనామా చేయవచ్చు. కానీ నేను ఓపికగా ఉన్నాను. జీ. పరమేశ్వర విషయంలో కూడా నేను సహనంతోనే వ్యవహరించాను'' అని డీకే శివకుమార్ అన్నారు.

ఈ సందర్భంగా గత కర్ణాటక రాజకీయ పరిణామాలను కూడా డీకే శివకుమార్ ప్రస్తావించారు. వీరేంద్ర పాటిల్ హయాంలో బంగారప్పకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదని, మల్లికార్జున ఖర్గేకు, ధరం సింగ్‌కు కూడా తొలుత అవకాశం రాలేదని పేర్కొన్నారు. అయితే వారంతా తర్వాత రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరారని వ్యాఖ్యానించారు. అయితే మల్లికార్జున ఖర్గే కర్ణాటక ముఖ్యమంత్రిగా ఎప్పుడూ బాధ్యతలు చేపట్టలేదు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. ''ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఓపికగా ఉండాలి. పార్టీ చాలా ముఖ్యమైనది. ఎవరైనా రాజీనామా చేస్తే కొన్ని నిమిషాల్లోనే దానిని ఆమోదిస్తాను'' అని డీకే శివకుమార్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని బోర్డులు, కార్పొరేషన్లలో కొత్త నియామకాలు చేపట్టనున్నట్లు కూడా ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం వివిధ బోర్డులు, కార్పొరేషన్లలో ఉన్నవారు తమ రాజీనామాలు సమర్పించాలని సూచించారు. ముందుగా పార్టీ కార్యకర్తలకు ఆయా సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యకర్తలకు అవకాశాలు కల్పించిన తర్వాత ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పిలిచి వారి సమస్యలపై మాట్లాడతానని పేర్కొన్నారు.

మంత్రివర్గ విస్తరణ తర్వాత పెరిగిన అసంతృప్తిని తగ్గించేందుకు డీకే శివకుమార్ సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం. కృష్ణప్పను ఒప్పించే బాధ్యతను మంత్రులు ఎన్. చలువరాయస్వామి, హెచ్‌సీ బాలకృష్ణకు ఇచ్చారు. మంగళవారం ఉదయం వీరిద్దరూ కృష్ణప్ప నివాసానికి వెళ్లారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో కలవకుండానే తిరిగి వెళ్లాల్సి వచ్చింది. దీంతో కేబినెట్ విస్తరణ తర్వాత కాంగ్రెస్‌లో అసంతృప్తి ఎంత తీవ్రంగా ఉందనే చర్చ మొదలైంది.

విజయనగర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ పదాధికారులు కూడా సామూహిక రాజీనామాలు సమర్పించారు. సీనియర్ నేత, ఎమ్మెల్యే ఎం. కృష్ణప్పకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్‌కు ఆగస్టు 4 తేదీతో రాసిన రాజీనామా లేఖలో.. కృష్ణప్పకు మంత్రివర్గంలో చోటు కల్పించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు.

విజయనగర నియోజకవర్గంలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మహిళా విభాగం అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, గ్యారంటీ పథకాల కమిటీ అధ్యక్షులు, ఇతర పార్టీ విభాగాల పదాధికారులు సామూహికంగా రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు లేఖలో పేర్కొన్నారు.

మంత్రివర్గంలో మహిళకు కేటాయించిన ఒక మంత్రి పదవి ఇంకా ఖాళీగా ఉండటంతో.. ఆ పదవి కోసం లాబీయింగ్ ప్రారంభమైంది. సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారం తన తండ్రితో కలిసి ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యే నయనా మోటమ్మ మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఐదుగురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ కూడా కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్‌టీసీ) చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. మంత్రివర్గంలో అవకాశం దక్కకపోవడంపై ఆయన తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ''నేను మంత్రి కావాలని ప్రజలు చెబుతున్నారు. కానీ నిర్ణయం తీసుకోవాల్సిన వారు మాత్రం అలా చెప్పలేదు. అందుకే నేను ఏమీ చేయలేను. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి రాజకీయాల్లో ఎదగడం చాలా కష్టం. రాజకీయాల్లో ఎదగాలంటే పెద్ద నాయకుల మద్దతు ఉండాలి లేదా తప్పు మార్గాల్లో డబ్బు సంపాదించాలి. ఇలాంటి రాజకీయ వ్యూహాలు నేర్చుకోకపోతే ఎదగడం కష్టమని మరోసారి రుజువైంది'' అని ఎస్ఆర్ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

అయితే కొందరు అసంతృప్త ఎమ్మెల్యేలు తమ నిర్ణయాలను మార్చుకున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంతో రాజీనామా చేస్తానని గతంలో హెచ్చరించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే బెలూరు గోపాలకృష్ణ.. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం రాజీనామా నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించారు.

''నిన్న నేను తీవ్ర నిరాశకు గురయ్యాను. అందుకే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను. మంత్రివర్గం రెండో విడత విస్తరణలో మంత్రి పదవి ఇస్తామని గతంలో చెప్పారు. నిన్న రాత్రి ముఖ్యమంత్రి నాకు ఫోన్ చేసి కలవాలని కోరారు. అందుకే ఆయనను కలిశాను. ఆయనతో మాట్లాడిన తర్వాత రాజీనామా చేయకూడదని నిర్ణయించుకున్నాను. ఆయనతో కలిసి పార్టీ అభివృద్ధికి పని చేస్తాను'' అని బెలూరు గోపాలకృష్ణ తెలిపారు.

మాజీ కాంగ్రెస్ మంత్రి, ఎమ్మెల్యే కేఎన్ రాజన్నతో పాటు ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ రాజేంద్ర కూడా మంత్రివర్గ విస్తరణపై నిరాశ వ్యక్తం చేశారు. తుమకూరు పెద్ద జిల్లా కావడంతో తనకు లేదా తన తండ్రికి మంత్రి పదవి దక్కుతుందని ఆశించామని రాజేంద్ర తెలిపారు. అయితే ఇప్పుడు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు.

''నా తండ్రికి మంత్రివర్గంలో అవకాశం దక్కుతుందని భావించాం. తుమకూరు పెద్ద జిల్లా. నాకు లేదా నా తండ్రికి మంత్రి పదవి వస్తుందని ఆశించాం. కానీ ఇప్పుడు ఏమీ చేయలేం. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాల్సిందే. ఒక ఎమ్మెల్యే రాజీనామా చేశారు. మరికొందరు కూడా రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నారు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. కొన్ని సందర్భాల్లో నేరుగా మాట్లాడటం కూడా సమస్యలకు దారితీస్తుంది. కేఎన్ రాజన్న కూడా నేరుగా మాట్లాడటం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయనకు మంత్రి పదవి వస్తుందని ఆశించాం. కానీ అవకాశం దక్కలేదు'' అని రాజేంద్ర పేర్కొన్నారు.

మంత్రివర్గ విస్తరణ తర్వాత కాంగ్రెస్‌లో అసంతృప్తి పెరుగుతుండటం పార్టీ నాయకత్వానికి కొత్త సవాలుగా మారింది. అసంతృప్త ఎమ్మెల్యేలను సమన్వయం చేసి పార్టీ ఐక్యతను కాపాడటంపై డీకే శివకుమార్ దృష్టి సారించారు.

# సమగ్ర సమాచారం ప్రజలకు తెలియాలి

**అమరావతి, ఆగస్టు 04, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. ''ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నా.. ఇదొక చారిత్రక అంశం. ఇప్పటి వరకు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలి. ప్రభుత్వం బాగా పనిచేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనం. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనార్టీలకు పెద్ద ఎత్తున సంక్షేమ ర్యక్రమాలు అమలు చేస్తున్నాం. కేంద్రం నుంచి వచ్చే నిధులతోనూ పథకాలు కొనసాగిస్తున్నాం. రైల్వే, రహదారుల కోసం కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించుకుంటున్నాయి. సంపద పెరిగితేనే ఉపాధి పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. పీ4 వల్ల 2.4లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. అందుకే.. మార్గదర్శి బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చా. పెట్టుబడుల ఆకర్షణకు 28 నూతన పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చా.23 లక్షల కోట్ల ఎంవోయూలు చేసుకున్నాం. దేశంలోనే పీపీపీ ప్రాజెక్టుల అమలులో ఏపీదే అగ్రస్థానం. ప్రజలకు అందుతున్న సేవలపై ప్రజాభిప్రాయం తీసుకుంటున్నాం. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నాం. ఏఐని ఉపయోగించి మెరుగైన సేవలందించే పని పెద్ద ఎత్తున చేస్తున్నాం. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదు. కష్టపడి పనిచేస్తే ఫలితం పదిరెట్లు ఉంటుంది.'' అని సీఎం వివరించారు.

**తెలంగాణలో ఆస్తులన్నీ తెలుగు వారే అనుభవిస్తున్నారు**

తెలంగాణలో ఆస్తులన్నీ తెలుగు వారే అనుభవిస్తున్నారని, ఎప్పుడూ కూడా తాను రెగ్రెట్ ఫీల్ అవ్వలేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆస్తుల పంపకం సరిగా జరగలేదన్నారు. 2019 తర్వాత రాష్ట్రం విధ్వంసానికి గురైందని, 2024లో కూటమి ప్రభుత్వం రాగానే బ్రాండ్ ఏపీని పునరుద్ధరించాం అని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో ఏమేం చెప్పామో అవన్నీ చేస్తున్నామని, 202526లో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశామని సీఎం చెప్పుకొచ్చారు. సీఎం ఈరోజు ఆర్థిక శాఖపై శ్వేత పత్రం విడుదల చేశారు.

'ఆర్థిక శాఖలో రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం ఎలాంటి ఎఫర్ట్ పెట్టామనేది అందరికి తెలియాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితిలో ఇదొక చారిత్రాత్మక ప్రెసెంటేషన్. పాలన బాగుంటే ప్రజల మీద పెద్ద ప్రభావితం చేస్తుంది. నెగటివ్ గవర్నన్స్ ఉంటే నెగటివ్ ప్రభావం చేస్తుంది. 2024లో ఒక అఖండ విజయం సాధించాం. 201924లో విధ్వంస పాలన సాగింది. ప్రజలందరూ భయంతో బ్రతికారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన TFiber సమీక్షా సమావేశంలో ప్రధాన కార్యదర్శి సీఎస్ సంజయ్ జాజు పాల్గొన్నారు.

'సెప్టెంబర్ 1 నుండి తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టిఫైబర్ ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే రోడ్‌మ్యాప్, టిస్వాన్ నుండి టిఫైబర్‌కు మార్పు, ఫ్యూచర్‌సిటీ కోసం డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, నిరంతరాయ డిజిటల్ గవర్నెన్స్, పౌర సేవలను మెరుగుపరచడానికి ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కార్యక్రమాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో సమీక్షించాం.' అని సీఎస్ కార్యాలయం ప్రకటించింది.



# మహిళలేం పావులు కాదు.. త్రిషపై ఉదయనిధి వ్యాఖ్యలపై సెలబ్రిటీల ఆగ్రహం



నటి త్రిషపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే ఉదయనిధిని పోలీసులు అరెస్ట్ చేయగా.. ఆయన వ్యాఖ్యలను తప్పుపడుతూ సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షమాణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ''ఉదయనిధి స్టాలిన్ ప్రసంగం చాలా అసభ్యంగా, అవమానకరంగా ఉంది. మహిళలను దూషించడం, కించపరచడం, అవమానించడం వాళ్లకి సాధారణ విషయంగా అనిపిస్తోంది. ఇలాంటి వాళ్ల నుంచి ఏం ఆశించాలి?. వీళ్లు ఒక విషయాన్ని బాగా గుర్తుపెట్టుకోవాలి.. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళల గౌరవాన్ని బలిపశువుగా చేసిన ఏ కుటుంబం కూడా వృద్ధిలోకి రాలేదు. రాజకీయాల్లో నేతల వ్యాఖ్యలకు హద్దులు ఉండాలి. మహిళలను గౌరవించాలి. అంతేగానీ మీ ఇష్టాయిష్టాలకు ఆడుకునే పావులుగా చూడకూడదు. మీ రాజకీయ ప్రత్యర్థి పనితీరు, దార్శనికత, నాయకత్వానికి మీరు సరితూగరని తెలిసినప్పుడు మాత్రమే.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సులభంగా అనిపిస్తుంది. బహిరంగ వేదికపై త్రిషను అవమానించినందుకు గానూ ప్రతిపక్ష నేత ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. తన తప్పును ఉదయనిధి హుందాగా అంగీకరిస్తాడో లేదో..!

క్షమాపణ చెప్పే ధైర్యం, సంస్కారం ఆయనకు ఉన్నాయో లేదో చూద్దాం?'' ''రాజకీయ రంగంలో ఉన్న వాళ్లు ఏమాత్రం సంబంధం లేని విషయాల్లో మహిళలను చేర్చకుండా అసలు సమస్యలపై దృష్టి పెడితే బాగుంటుంది. ఉదయనిధి మద్దతుదారులు నటి పేరును ప్రస్తావించినప్పుడు కనీసం వాళ్లను ఆపలేదు సరికదా.. వాళ్లతో కలసి ఆయన కూడా అసభ్యంగా మాట్లాడారు. ఇది దారుణం''

# నటి త్రిషపై డబుల్ మీనింగ్ డైలాగ్.. ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్



కావేరీ జలాల అంశం ప్రస్తుతం తమిళనాడులో హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో తంజావూరులో జరిగిన నిరసనల ప్రదర్శనలో నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉదయనిధిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కావేరీ నదీ జలాల అంశంపై సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డెల్టా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉదయనిధి పరోక్షంగా నటి ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ''ఇవి అసహ్యమైన వ్యాఖ్యలు. ఎవరిపైనా ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. డీఎంకే దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలకు ఈ మాటలు నిదర్శనం'' అని టీవీకే నేతలు మండిపడ్డారు. భాజపా నేతలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. ఇది సిగ్గుచేటు ప్రవర్తన అని తప్పుపట్టారు. ఉదయనిధి తీరుపై టీవీకే పార్టీ.. జాతీయ మహిళా కమిషన్‌ను ఫిర్యాదు చేసింది. ఆయన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని, చర్యలు చేపట్టాలని కోరింది. అలాగే ఉదయనిధి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

**కోర్టును ఆశ్రయించిన ఉదయనిధి**

**ఉదయనివ్యాఖ్యలు తమిళనాడులో రాజకీయ దుమారం రేపాయి. డీఎంకే, టీవీకే నేతల మధ్య వాగ్వాదం నడుస్తోంది. ఆయన ఇంటిముందు విజయ్ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. మరోవైపు, బెయిల్ కోసం ఉదయనిధి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మధ్యాహ్నం అత్యవసర విచారణ జరగనుంది.**

# కమలానికి ప్రశాంత్ కిశోర్ షాక్

అహ్మదాబాద్, భోపాల్: బిహార్‌లోని బంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గంలో భాజపాకు భారీ షాక్ తగిలింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీ చేసిన ఈ స్థానంలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించారు. 1995 తర్వాత ఈ నియోజకవర్గంలో భాజపా ఓడిపోవడం ఇదే ప్రథమం. ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరి బాధ్యతలు చేపట్టాక జరిగిన ఈ ఉప ఎన్నికలో భాజపా ఓడిపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు.

బంకీపుర్‌లో భాజపా అభ్యర్థి నీరజ్ కుమార్‌పై 19,324 ఓట్ల మెజారిటీతో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించారు. సోమవారం జరిగిన కౌంటింగ్‌లో ఆయనకు 64,151 ఓట్లు వచ్చాయి. నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు వచ్చాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తాకు కేవలం 14,273 ఓట్లే దక్కాయి.

పార్టీ విజయం ఖాయమని ఉదయమే 200 కేజీల లడ్డూలను భాజపా తెప్పించింది. చివరకు ఫలితాలను చూశాక డీలాపడింది. నితిన్ నబీన్ వరుసగా ఐదుసార్లు బంకీపుర్ నుంచి గెలిచారు. గత ఏడాది నవంబరులో గెలిచాక భాజపా అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత రాజ్యసభకు ఆయన ఎన్నిక కావడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో జులై 30వ తేదీన ఇక్కడ పోలింగ్ జరిగింది. 3.8 లక్షల మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో కేవలం 34.30శాతం పోలింగే నమోదైంది. ఉప ఎన్నికలో నీతీశ్ కుమార్ అనే స్వతంత్ర అభ్యర్థికి 149 ఓట్లు, లాలూ ప్రసాద్ అనే స్వతంత్ర అభ్యర్థికి 81 ఓట్లు వచ్చాయి.

**భాజపా ఓటమికి కారణాలివీ..**

వాస్తవానికి నబీన్ స్థానంలో అభిషేక్ బంటీ అనే నేతకు భాజపా టికెట్ ఇచ్చింది. ఆయన చివరి నిమిషంలో కుటుంబ కారణాలతో పోటీ నుంచి విరమించుకున్నారు.

దీంతో హడావుడిగా పెద్దగా పేరులేని భాజపా యువ నేత నీరజ్ కుమార్‌ను పార్టీ బరిలోకి దింపింది.

ఇటీవల సీజేపీకి మద్దతుగా బిహార్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు విరుచుకుపడటం వ్యతిరేక ప్రభావాన్ని చూపింది.

సహజంగా ఇండియా కూటమికి మద్దతిచ్చే ముస్లింలు ఈసారి ఆర్జేడీ అభ్యర్థికి కాకుండా ప్రశాంత్ కిశోర్‌కు ఓటేశారు.

**మోదీకి హెచ్చరిక: ప్రశాంత్**

బంకీపుర్‌లో తన విజయం ప్రధాని మోదీకి హెచ్చరిక లాంటిదని, నేర చరిత్ర ఉన్న ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరిని మార్చాలని 49ఏళ్ల ప్రశాంత్ కిశోర్ డిమాండు చేశారు. రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వానికి ఇది రెఫరెండమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఏ కూటమిలోనూ తాము చేరబోమని ప్రకటించారు.

**గుజరాత్‌లో నిలబెట్టుకున్న భాజపా**



గుజరాత్‌లోని మంజల్‌పుర్ అసెంబ్లీ స్థానాన్ని భాజపా నిలబెట్టుకుంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి భికంభాయ్ రబరీపై భాజపా అభ్యర్థి గోవింద్‌భాయ్ పటేల్ 30,630 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పటేల్‌కు 55,481 ఓట్లురాగా.. రబరీకి 24,851 ఓట్లు వచ్చాయి.

2022లో ఈ నియోజకవర్గంలో భాజపాకు 1,00,754 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈసారి పోలింగ్‌తోపాటు మెజారిటీ భారీగా తగ్గింది.

**మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్..**

మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకుంది. ఈ నియోజకవర్గంలో భాజపా అభ్యర్థి అశుతోష్ తివారీపై కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యాం సింగ్ 6,016 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సింగ్‌కు 66,757 ఓట్లురాగా.. తివారీకి 60,741 ఓట్లు వచ్చాయి.

# నా భర్త బతికే ఉన్నాడు: సుప్రీంలో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసిన సెయిలర్ భార్య




తన భర్త బతికే ఉన్నారంటూ మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన్ను కోర్టు ముందుకు తీసుకువచ్చేలా హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఒమన్ తీరంలో నౌకపై జరిగిన దాడిలో ఆశిశ్ మరణించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే . బిహార్‌లోని బెట్టియాకు చెందిన ఆశిశ్ కుమార్.. ఒమన్ తీరంలో స్కైలైట్ చమురు ట్యాంకర్‌పై జరిగిన డ్రోన్ దాడిలో మరణించినట్లు ఇప్పటివరకు భావిస్తున్నారు. పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభమైన సమయంలో మార్చిలో ఆ దాడి జరిగింది. అప్పుడు నౌకలో 10 మంది భారత నావికులు ఉన్నారని ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. అయితే వారిలో 8 మందిని రక్షించామని, ఇంజిన్ రూమ్‌లో ఉన్న కెప్టెన్ కుమార్, మరో సిబ్బంది దలిప్ గల్లంతయ్యారని తెలిపింది. మార్చి నాలుగున కెప్టెన్ రూమ్‌లో కాలిన శరీర అవయవాలను ఒమనీ తీర రక్షణ సిబ్బంది గుర్తించినట్లు వెల్లడైంది. కెప్టెన్ రూమ్‌లోకి ఇంకెవరూ ప్రవేశించలేదని, అవి కుమార్‌వే కావొచ్చని అప్పుడు ఎంబసీ పేర్కొంది.

అయితే ఆ వాదనలను కుమార్ కుటుంబం అంగీకరించడం లేదు. ఆయన సోదరుడు డీఎన్‌ఏ టెస్టింగ్ నమూనాలు ఇచ్చినా అవి సరిపోలలేదని పేర్కొన్నారు. మరోవైపు ఆశిశ్‌ను విడుదల చేయాలంటే రూ.20 లక్షలు చెల్లించాలంటూ అంతర్జాతీయ నంబర్ నుంచి కాల్ వచ్చిందని చెప్తున్నారు. ఈ క్రమంలోనే కెప్టెన్ భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన భర్త ప్రాణాలతోనే ఉన్నాడని, విదేశీయుల చేతిలో బందీగా ఉన్నాడని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భర్త ఎక్కడున్నాడో గుర్తించి, కోర్టు ముందు ప్రవేశపెట్టేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. కెప్టెన్ రూమ్‌లో గుర్తించిన అవశేషాలు ఆశిశ్ కావని ఒమన్‌లోని రాయబార కార్యాలయం మార్చి 15న సమాచారం ఇచ్చిందని ఆ పిటిషన్‌లో ఆమె పేర్కొంది.

# వాహనాలు మాట్లాడుకుంటాయ్!

**- 'వీ2వీ' ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం**



మీరు కారు నడుపుతున్నారు.. ముందు వేరే వాహనం వెళ్తోంది.. మలుపు వద్ద దారి సరిగా కనిపించడం లేదు.. ఇంతలో మీ ముందున్న వాహన డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు.. దాన్ని మీరు గమనించలేదు.. కానీ మీ కారు దానంతటదే పసిగట్టి మిమ్మల్ని అప్రమత్తం చేసింది.. పెద్ద ప్రమాదాన్ని నివారించింది! అద్భుతం కదా..? ఇలాంటి ఆధునిక సాంకేతికత మన దేశ వాహనాల్లో త్వరలోనే అందుబాటులోకి రానుంది. వాహనాలు వాటంతటవే తమ వేగం, దిశ వంటి వివరాలను సమీపంలోని ఇతర వాహనాలతో పంచుకునేందుకు వీలుగా రూపొందించిన 'వెహికిల్ టు వెహికిల్ (వీ2వీ)' కమ్యూనికేషన్ వ్యవస్థలను దశల వారీగా అమల్లోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 1989కు సవరణలను ప్రతిపాదిస్తూ రోడ్డు రవాణా, రహదారుల శాఖ తాజాగా ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే ఏడాది అక్టోబర్ 1 మొదలుకొని.. ఆ తర్వాత తయారయ్యే ఎల్, ఎం, ఎన్ కేటగిరీ వాహనాలన్నింటిలోనూ వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థ (ఒకవేళ అమరిస్తే) ఏఐఎస్230 ప్రమాణాలకు లోబడి ఉండాలి. 2028 అక్టోబరు 1 నుంచి ఉత్పత్తయ్యే ఈ కేటగిరీ వాహనాలన్నింటిలో కచ్చితంగా ఏఐఎస్230 ప్రమాణాలకు అనుగుణంగా 'వీ2వీ'ని అమర్చాల్సిందే. ముసాయిదాపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను 30 రోజుల్లో పంపాలని కేంద్రం కోరింది. ప్రస్తుతమున్న సంప్రదాయ వాహన భద్రత వ్యవస్థ కేవలం సెన్సర్లు, డ్రైవర్ల స్పందనపై ఆధారపడి హెచ్చరిక సంకేతాలు పంపుతుంది. వీ2వీ కమ్యూనికేషన్ మాత్రం కంటికి కనిపించని ఇతర సమాచారాన్నీ అందిస్తుంది. సులభంగా చెప్పాలంటే ఈ సాంకేతికత సాయంతో వాహనాలు పరస్పరం మాట్లాడుకుంటాయి! తమ వేగం, స్థితి, దిశ, యాక్సెలరేషన్ వంటి వివరాలను రియల్‌టైంలో పరస్పరం పంచుకుంటాయి. ఆకస్మిక బ్రేకింగ్, ఎదురెదురుగా ఢీకొనే ముప్పు, ప్రమాదకరంగా రహదారి వరుసలు మారడం, అత్యవసర వాహనాల రాకకు సంబంధించిన కీలక సమాచారాన్ని వీ2వీ సాంకేతికత డ్రైవర్లకు పంపి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

# ఈవీ పాలసీ ఎఫెక్ట్: జులైలో రికార్డు స్థాయి విద్యుత్ వాహనాల రిజిస్ట్రేషన్



దేశ రాజధానిలో కాలుష్యానికి చెక్ పెట్టేలా.. కొత్త ఈవీ పాలసీ 2.0ని దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది జులై నెలలో రికార్డు స్థాయిలో ఈవీ రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు ప్రభుత్వ వాహన్ పోర్టల్ డేటా పేర్కొంది.

విద్యుత్ వాహన కేటగిరీలో భాగంగా జులైలో 10,719 వాహనాలను వినియోగదారులు రిజిస్టర్ చేసుకున్నట్లు డేటా తెలిపింది. జూన్ నెలతో పోలిస్తే.. 1,423 వాహనాలు అదనంగా రిజిస్టర్డ్ అయ్యాయి. గతేడాది జులైలో 6,414 యూనిట్లు మాత్రమే రిజిస్టర్ అవ్వడం గమనార్హం. దిల్లీ ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2026 జులై 1 నుంచి అమల్లోకి రావడం ఇందుకు కారణం. రూ.30 లక్షల్లోపు విద్యుత్ వాహనాలపై జీవితకాల పన్నును, రిజిస్ట్రేషన్ ఛార్జీలను దిల్లీ ప్రభుత్వం ఎత్తివేసింది.

2027, జనవరి ఒకటి నుంచి ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. ఏప్రిల్ 1, 2028 నుంచి ఎలక్ట్రిక్ టూ వీలర్ మోడల్స్ రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతించనున్నారు. పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలో విద్యుత్తు ద్విచక్ర వాహనం కొనుగోలు చేసేవారికి రూ.30 వేలు, రెండో ఏడాదిలో రూ.20 వేలు, మూడో ఏడాది రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

# సహజీవనంలో ఉండే మహిళలకూ గృహ హింస చట్టం



సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. సహజీవనంలో ఉండే మహిళలకు కూడా గృహ హింస, వరకట్న వేధింపుల నిరోధక చట్టం (సెక్షన్ 498A) వర్తిస్తుందని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. వివాహం చేసుకోకపోయినా, పెళ్లి లాంటి బంధంతో కలిసి ఉండే మహిళలపై జరిగే హింస కూడా తీవ్రమైనదేనని ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

గృహ హింస నుంచి రక్షణ కల్పించడంలో చట్టబద్ధంగా వివాహం చేసుకున్న మహిళకు, సహజీవనం చేస్తూ.. వివాహం తరహా సంబంధంలో ఉన్న మహిళకు మధ్య వ్యత్యాసం చూపడం సరికాదని అభిప్రాయపడింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దేశంలోని ప్రతి వ్యక్తికి చట్టం సమాన రక్షణ కల్పిస్తుందన్న ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. అయితే, వివాహం చేసుకునే ఉద్దేశంతో సహజీవనం చేసే వారికి మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుందని స్పష్టం చేసింది.

# తృణమూల్‌కు సుభాష్ చంద్రబోస్ మనవడి రాజీనామా



పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పార్టీ నుంచి వైదొలగుతున్నట్లు వెల్లడించారు. అయితే, ఈ విషయంపై తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

2016లో భాజపాలో చేరిన చంద్ర కుమార్.. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేశారు. 2016లోనే రాష్ట్ర ఉపాధ్యక్షుడి బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే, పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2020లో ఆ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. నేతాజీ భావజాలాన్ని ప్రోత్సహిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడంలో భాజపా విఫలమైందని ఆరోపిస్తూ.. 2023లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తృణమూల్‌లో చేరారు.

# విద్యార్థులపై నీట్ కేసుల్ని రాష్ట్రాలు ఉపసంహరించుకోవచ్చు



తీవ్రమైన నేరాల్లో పాల్గొన్న చరిత్ర ఉన్న విద్యార్థుల విడుదల విషయంలోనే తాము అభ్యంతరం వ్యక్తం చేశామని, మిగిలిన వారిపై కేసులను చట్ట ప్రకారం రాష్ట్రాలు మూసివేయడమో.. ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకోవడమో చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ సంబంధిత ఆందోళనల్లో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో తాము సీరియస్‌గా లేమని కేంద్రం తెలిపిన మీదట ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఈ స్పష్టతను ఇచ్చింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తొలుత ప్రభుత్వ వైఖరిని కోర్టుకు నివేదించారు. హేయమైన నేరాలకు పాల్పడిన చరిత్ర సుమారు 2,700 మందికి ఉందని, వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకోదలచుకోలేదని స్పష్టంచేశారు. ''విచక్షణరహితంగా బలప్రయోగం చేసిన పోలీసు అధికారికి అనవసర రక్షణ కల్పించరాదు. అలాగే.. కరడుగట్టిన నేరగాడెవరూ విద్యార్థుల ముసుగులో రక్షణ పొందకూడదు'' అని సీజేఐ వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఈ నెల 18న జరగనుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తంచేసింది. జులై 25న కుదిరిన ఒప్పందాన్ని కేంద్రం, భాజపాఎన్డీయే పాలిత రాష్ట్రాలు వెంటనే అమలు చేస్తాయని ఆశాభావం వ్యక్తంచేసింది.




# విదేశీ పెట్టుబడులన్నీ వరాలేనా?

మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐలకు) ఆకర్షణ ఎక్కువ. ఎఫ్‌డీఐలు ఎంత ఎక్కువగా వస్తే దేశానికి అంత మంచిదంటారు. అవి దేశంలోకి మూలధనాన్ని, అత్యాధునిక సాంకేతికతను, ఉపాధిని, ప్రగతిని తీసుకొస్తాయని సామాన్యుల నుంచి విధాన నిర్ణేతలదాకా చాలామంది బలంగా నమ్ముతారు. కానీ, విదేశీ పెట్టుబడులతో లాభమా, నష్టమా?... ఇదెప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలిపోతోంది.

గత రెండేళ్లలో దేశంలోకి రికార్డు స్థాయిలో ఎఫ్‌డీఐల స్థూల ప్రవాహం వచ్చిందని గణాంకాలు చాటుతున్నాయి. ఈ లెక్కల వెనకున్న లోతైన వాస్తవాలను, దాగి ఉన్న అంతర్జాతీయ ఆర్థిక రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే చేదు నిజం వెల్లడవుతుంది. ఈ స్థూల పెట్టుబడులు ప్రధానంగా మూడు రకాలు. మొదటిది బహుళజాతి సంస్థల నిజమైన ఎఫ్‌డీఐ. రెండోది ఆర్థిక ఎఫ్‌డీఐ. అంటే స్వల్పకాలిక లాభాల కోసం వచ్చే ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ తదితరాలు. మూడోది భారత సంబంధిత ఎఫ్‌డీఐ. మన దేశీయులే విదేశీ మార్గాల ద్వారా వెనక్కి తిప్పి పెట్టే పెట్టుబడులు. ఈ మూడింటి లక్ష్యాలు, వాటితో దేశానికి జరిగే లాభనష్టాలు వేర్వేరు. కానీ, గణాంకాల్లో వీటన్నింటినీ ఒకే గాటన కట్టేసి, ఎఫ్‌డీఐలు వెల్లువలా వస్తున్నాయని సంబరపడుతున్నాం.

**కొత్త పరిశ్రమలా? ఉన్నవాటి స్వాధీనమా?**

విదేశీ పెట్టుబడులు వస్తే కొత్త ఫ్యాక్టరీలు వస్తాయని ఆశిస్తాం. కానీ దేశంలోకి వస్తున్న ఎఫ్‌డీఐలలో అత్యధికం, ఇప్పటికే లాభాల్లో ఉన్న, భారతీయులు నెలకొల్పిన కంపెనీలను కొనుగోలు చేసేందుకే వస్తున్నాయి. ఉదాహరణకు, ఫార్మా రంగంలో అద్భుతమైన పరిశోధనలతో ప్రపంచస్థాయికి ఎదిగిన కొన్ని దేశవాళీ కంపెనీలను విదేశీ సంస్థలు కొనేశాయి. ఆహార, పానీయాల రంగంలో అనేక బ్రాండ్లను బహుళజాతి సంస్థలు తమ చేతుల్లోకి తీసేసుకున్నాయి. దీనివల్ల దేశంలో కొత్తగా ఉత్పాదక సామర్థ్యం పెరగదు. కేవలం యాజమాన్య మార్పిడి మాత్రమే జరుగుతుంది. విదేశీ కంపెనీల రాకతో, వాటితో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వస్తుందని ఆశిస్తాం. అభివృద్ధి చెందిన దేశాలు, వాటి బహుళజాతి సంస్థలు పెట్టుబడులు తెస్తాయి కానీ, తమ దగ్గర ఉన్న అత్యున్నత సాంకేతిక పరిజ్ఞాన రహస్యాలను మాత్రం మనకు బదిలీ చేయవు. ఎప్పటికీ వాటిపైనే ఆధారపడేలా చేసుకుంటాయి. గతంలో దేశీయ భాగస్వాములతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసిన ఈ సంస్థలు, ఇప్పుడు ప్రభుత్వ విధానాలు సరళీకృతం కావడంతో వందశాతం సొంత అనుబంధ సంస్థల ఏర్పాటుకే మొగ్గుచూపుతున్నాయి. దీనివల్ల స్థానిక సాంకేతికత స్వయంసమృద్ధి సాధ్యం కాదు. మనం ఎల్లప్పుడూ వారిపై ఆధారపడేలా చేయడం, ప్రపంచ మార్కెట్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడమే వాళ్ల అసలు లక్ష్యం. మరోవైపు, ఆధునిక మేధోసంపత్తి హక్కులు, పేటెంట్ చట్టాలు- బహుళజాతి సంస్థల ఆధిక్యాన్ని కాపాడేలా, వర్ధమాన దేశాలు సొంతంగా ఎదగకుండా అడ్డుపడుతున్నాయి. పేటెంట్ చట్టాల ముసుగులో సాంకేతిక రక్షణవాదం పాటిస్తున్నారు. ఒకవేళ దేశీయ సంస్థలు తమంతట తాముగా కష్టపడి ఆవిష్కరణలు చేసి ప్రపంచస్థాయికి చేరితే, ఆ విదేశీ కంపెనీలు తమ అపార ఆర్థిక బలంతో వాటిని కొనుగోలు చేసేస్తున్నాయి. దీనివల్ల మన పారిశ్రామిక దిగ్గజ సంస్థలు ఇతరుల హస్తగతమవుతున్నాయి.

మన దేశంలో చాలామంది ఆర్థిక సంస్కరణలను అభినందించడం సహజమే కావచ్చు. కానీ నియంత్రణ లేని సరళీకరణ చేదు ఫలాలను కూడా ఇస్తుంది. దేశీయ అవసరాల కోసం వచ్చినట్లుగా కనిపించే విదేశీ మూలధనం, వాస్తవానికి అపారమైన సంపదను వెనక్కి తీసుకెళ్తోంది. ఫైనాన్షియల్ ఎఫ్‌డీఐల రూపంలో వచ్చే ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ అయిదారేళ్లలో తమ పెట్టుబడిపై పదులరెట్లు లాభాలతో వెనక్కి వెళ్లిపోతాయి. అలాగే, విదేశీ కంపెనీలు రాయల్టీలు, డివిడెండ్లు, సాంకేతిక రుసుముల పేరుతో తాము తెచ్చిన దానికంటే ఎక్కువ విదేశీ మారక ద్రవ్యాన్ని తరలించుకుపోతున్నాయి. ఇది పెట్టుబడి ప్రవాహం కాదు, నిజానికి సంపద తరలింపు. ఉదాహరణకు ఆహారోత్పత్తుల ప్రాసెసింగ్ రంగంలోకి భారీగా పెట్టుబడులు వచ్చాయని అనుకుంటున్నాం. కానీ ఈ పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాల్లో కోల్డ్‌చైన్‌లు, నిల్వ కేంద్రాలు వంటి సదుపాయాలను నిర్మించడం లేదు. బదులుగా బంగాళాదుంపల చిప్స్, కార్బొనేటేడ్ కూల్‌డ్రింక్స్, చక్కెరతో కూడిన పండ్ల రసాలు వంటి విదేశీ బ్రాండ్‌ల మార్కెట్ విస్తరణకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. దీనివల్ల రైతులకు దక్కే లబ్ధి శూన్యం. ఈ మాత్రం పనులు మన దేశీయ కంపెనీలు కూడా చేయగలవు.

**ఉపయోగించుకోవడంలోనే సాఫల్యత...**

ఎఫ్‌డీఐ అంటే సర్వరోగ నివారిణి అనే ఆలోచన నుంచి బయటపడాలి. విదేశీ పెట్టుబడులు విదేశీయుల షరతులపై కాకుండా దేశాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. మన మార్కెట్‌ను, కంపెనీలను ఎక్కువగా విదేశీయులకు అప్పగిస్తే, 'ఆత్మనిర్భర్ భారత్' సాధ్యంకాదు. అయితే, ఈ సమస్యకు పరిష్కారం విదేశీ పెట్టుబడులను పూర్తిగా వ్యతిరేకించడం, వాటికి తలుపులు మూసేయడం కాదు. ఎఫ్‌డీఐల సాఫల్యం భారీ పెట్టుబడులను రాబట్టడంలో మాత్రమే ఉండదు. వాటిని దేశ శ్రేయస్సుకూ, అభివృద్ధికీ గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోవడంలో ఉంటుంది. బహుళజాతి సంస్థలనే నమ్ముకునే పద్ధతిని వదిలి, దేశీయ పరిశ్రమలను కాపాడుకునే దిశగా ముందడుగు వేయాలి. భారత్ తన భారీ మార్కెట్ పరిమాణాన్ని వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవాలి. అస్థిరమైన విదేశీ ప్రైవేట్ ఈక్విటీల స్థానంలో, స్వదేశీ సంస్థలకే దీర్ఘకాలిక మూలధనాన్ని అందించే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. ప్రతి రంగాన్ని నిశితంగా సమీక్షించి, ఎఫ్‌డీఐ విధానాన్ని క్రమబద్ధంగా సవరించాలి. విదేశీ సంస్థలను స్వాగతించడం మాత్రమే కాకుండా, అవి మన దేశంలో బలమైన సప్లయ్ చైన్‌లు నిర్మించేలా నిబంధనలు విధించాలి. భవిష్యత్తులో పారిశ్రామిక దిగ్గజాలు కాగలవు అనుకున్న స్థానిక సంస్థలకు ప్రభుత్వపరంగా తోడ్పాటు అందించాలి. దేశీయ సంస్థలను ఐఐటీలు, జాతీయ ప్రయోగశాలలతో అనుసంధానించి, స్వదేశీ సాంకేతికతకు బాటలు వేయాలి.




# నకిలీ మందులు, నకిలీ వైద్యులతో ఆరోగ్య సంక్షోభం

**హెచ్. ప్రతాప్**



ఆరోగ్యమే మహాభాగ్యమని మన సంస్కృతి చెబుతుంది. కానీ నేడు అదే ఆరోగ్యం నకిలీ మందులు, నకిలీ వైద్యుల కారణంగా తీవ్ర ప్రమాదంలో పడుతోంది. ప్రాణాలను కాపాడాల్సిన వైద్య వ్యవస్థలో కొందరు అక్రమార్కులు చొరబడి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారి ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా నిలిచింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అంచనాల ప్రకారం తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో చలామణిలో ఉన్న వైద్య ఉత్పత్తుల్లో దాదాపు 10 శాతం వరకు నాణ్యతలేనివి లేదా నకిలీవి ఉండే అవకాశం ఉంది. ఇటువంటి మందులు వ్యాధిని నయం చేయకపోవడమే కాకుండా, రోగుల ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేస్తాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టానికీ దారితీస్తాయి. అంతేకాకుండా యాంటీబయాటిక్ నిరోధకత వంటి ప్రపంచ ఆరోగ్య సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.భారతదేశంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (CDSCO) నకిలీ, నాణ్యతలేని మందులపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోంది. పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,41,322 ఔషధ నమూనాలను పరీక్షించగా, 3,012 నమూనాలు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా (Not of Standard Quality) ఉండగా, 283 నమూనాలు నకిలీ లేదా కల్తీవిగా గుర్తించబడ్డాయి. ఈ గణాంకాలు నకిలీ మందుల ముప్పు ఇప్పటికీ కొనసాగుతోందని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఇటీవలి కాలంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో నకిలీ మందుల ముఠాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. బీహార్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్రాష్ట్ర నకిలీ ఔషధ ముఠాను అధికారులు ఛేదించి అక్రమ గిడ్డంగులు, రహస్య తయారీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో నకిలీ బిల్లుల ద్వారా మందులు విక్రయిస్తున్న ముఠాలను అరెస్టు చేశారు. హర్యానాలో పారిశ్రామిక రసాయనాలను ఔషధ తయారీకి వినియోగిస్తున్న అక్రమ రాకెట్‌ను వెలికితీశారు. మహారాష్ట్రలోనూ నకిలీ మందుల సరఫరాపై ఆహార, ఔషధ పరిపాలన శాఖ విస్తృత తనిఖీలు నిర్వహించి పలు దుకాణాలపై చర్యలు తీసుకుంది. ఈ ఘటనలు నకిలీ మందుల వ్యాపారం సంఘటిత నేరంగా మారుతోందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.మరోవైపు గ్రామీణ భారతదేశంలో నకిలీ వైద్యుల సమస్య కూడా అత్యంత ఆందోళనకరంగా మారింది. పలు పరిశోధనలు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న వారిలో గణనీయమైన సంఖ్యలో గుర్తింపు పొందిన వైద్య అర్హతలు లేని వారు ఉన్నారని సూచిస్తున్నాయి. అర్హతలేని వ్యక్తులు తమను వైద్యులుగా పరిచయం చేసుకొని ప్రజలకు చికిత్స అందించడం వల్ల అనేక మంది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. సరైన పరీక్షలు లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బలమైన ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల వ్యాధులు మరింత తీవ్రమవుతున్నాయి.ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వైద్యుల కొరత, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలు, వైద్య సదుపాయాల లేమి, ప్రజల్లో అవగాహన లోపం. అత్యవసర పరిస్థితుల్లో సమీపంలో కనిపించే వ్యక్తినే వైద్యుడిగా నమ్మి ప్రజలు చికిత్స పొందుతున్నారు. ఈ బలహీనతనే అక్రమార్కులు తమ వ్యాపారంగా మార్చుకున్నారు.కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం దేశంలో 13.88 లక్షల నమోదిత అల్లోపతి వైద్యులు, 7.5 లక్షలకు పైగా ఆయుష్ వైద్యులు ఉన్నప్పటికీ, వారి సేవలు గ్రామీణ ప్రాంతాలకు సమానంగా అందడం లేదు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత నకిలీ వైద్యులకు అవకాశంగా మారుతోంది .ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టాలి. నకిలీ మందుల తయారీ, నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలి. ఔషధ సరఫరా గొలుసును పూర్తిగా డిజిటల్ పర్యవేక్షణలోకి తీసుకురావాలి. ప్రతి మందుపై గుర్తింపు వ్యవస్థను బలోపేతం చేయాలి. గ్రామాల్లో పనిచేసే వైద్యుల అర్హతలను ప్రజలు సులభంగా ధృవీకరించుకునే విధానాన్ని అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాలి. అదే సమయంలో నకిలీ మందులు, నకిలీ వైద్యుల ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి.ప్రాణాలను కాపాడాల్సిన మందులు ప్రాణాలను హరించే విషంగా మారకూడదు. వైద్యుడనే పవిత్రమైన వృత్తిని ముసుగుగా చేసుకుని ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ వైద్యులకు, నకిలీ మందుల మాఫియాకు చట్టం అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆరోగ్యం ప్రతి పౌరుడి మౌలిక హక్కు. ఆ హక్కును కాపాడటం ప్రభుత్వం, వైద్య వ్యవస్థ, సమాజం, ప్రతి పౌరుడి ఉమ్మడి బాధ్యత. నకిలీ మందులు, నకిలీ వైద్యులపై రాజీలేని పోరాటం సాగించినప్పుడే ఆరోగ్యవంతమైన భారతదేశం సాకారం అవుతుంది.

# కాక్రోచ్ దండు కదను తొక్కిన వేళ

**'చరిత్ర గమనాన్ని మార్చడానికి గొప్ప శక్తులు అవసరం లేదు. తమ లక్ష్యంపై మొక్కవోని విశ్వాసంతో రగిలిపోతున్న దృఢ సంకల్పం గల కొద్దిమంది వ్యక్తుల సమూహం కూడా మార్పును సాధ్యం చేయగలదు 'అని మహాత్మాగాంధీ అన్నారు. భారతదేశం ఇప్పుడు ఒక అనిర్వచనీయ మార్పు దిశగా సాగుతున్నట్లు కనపడుతోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నెల రోజులుగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కార్యకర్తలు సోమవారం దేశ రాజధానిలో వర్షా కాల సమావేశాల తొలి రోజు పార్లమెంటును ముట్టడించడం ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ఒక బృహత్పరిణామం అని చెప్పక తప్పదు. నాలుగంచెల బారికేడ్లు ఏర్పాటు చేసి, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్, ఢిల్లీ, త్రిపుర పోలీసు బలగాలను పెద్ద ఎత్తున మోహరించినా, మెట్రో స్టేషన్లను మూసివేసినా, ఇంటర్నెట్ దిగ్బంధనం చేసినా సరే.. వేల సంఖ్యలో ఉన్న కాక్రోచ్ దండు పార్లమెంటు గేట్ల వరకు దూసుకెళ్లింది. పోలీసులు చితకబాదుతున్నా యువతీ యువకులు తెగింపు ప్రదర్శించారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో గాయాలతో పడి ఉన్న యువతీ యువకులే సోమవారం నాటి దమనకాండకు ప్రత్యక్ష సాక్షులు.**




ఒక దశాబ్దానికి పైగా ప్రతిపక్షాలు ఎన్ని దాడులు, విమర్శలు చేసినా చలించని మోదీ ప్రభుత్వం బొద్దింకల తిరుగుబాటు ఉదంతంతో ఆత్మరక్షణలో పడ్డట్లు స్పష్టమవుతోంది. కాక్రోచ్ పార్టీ ప్రారంభించిన ఉద్యమంలో ఎంతమంది పాల్గొన్నారు అన్నది ముఖ్యం కాదని, దాని ప్రభావం ఎంత మేరకు ఉన్నది అన్నదే ముఖ్యమని బీజేపీ ఎంపీ ఒకరు చెప్పారు. 'మా నాన్న బీజేపీలో అతి ముఖ్యమైన నాయకుడు. అయితే సంభవిస్తున్న పరిణామాలు అంత ఆరోగ్యకరంగా లేవు..' అని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న ఒక యువకుడు అన్నారు. 'రాజకీయ నాయకులు విఫలమైన చోట పిల్లలే ప్రశ్నిస్తారు..' అని ఒక విద్యార్థి అన్నారు.

నిజానికి కాక్రోచ్ జనతా పార్టీ ఒక సంస్థ కాదు. దేశ వర్తమాన చరిత్రలో దిక్కుతోచని యువతీ యువకుల సమూహమది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వచ్చిన వారు కానీ, ఊరేగింపులో పాల్గొన్నవారు కానీ ఎవరో డబ్బులిచ్చి పిలిస్తే వచ్చినవారు కాదు. వారి రాక కోసం ఎవరూ బస్సులు, రైళ్లు ఏర్పాటు చేయలేదు. కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చే వారిని ఢిల్లీకి బయలుదేరేలా చేసింది. కేవలం నీట్ ప్రశ్న పత్రాల లీక్‌కు మాత్రమే రగిలిపోతూ వారు రాలేదు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా నిరుద్యోగం, చాలీచాలని జీతాలు, వ్యవస్థలో లోపాలు, రాజకీయ పార్టీల కుతంత్రాలను చూసి విసిగిపోయినవారే ఆ వచ్చిన యువతీయువకులు. జంతర్ మంతర్ ధర్నా స్థలానికి వచ్చిన వారికి ఒక లక్ష్యం అంటూ ఏమీ లేదు. 14-28 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతను లెఫ్ట్, రైట్ అనే సిద్ధాంతాల మూసలో ఇమడ్చలేము. ఎమర్జెన్సీ వారి అనుభవంలో లేదు. ఒకప్పుడు ప్రతిపక్షాలను ఏకం చేసిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ గురించి వారికి తెలియదు. మండల్, కమండల్ ఉద్యమాల అనుభవం సైతం వారికి లేదు. మూడు దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనల జ్ఞాపకాలు వారికి లేవు. వర్తమాన సమస్యలతో సతమతమవుతూ తాము ఏమి చేయాలో తేల్చుకోలేక, భవిష్యత్తు అగమ్యగోచరమై, రకరకాల ప్రశ్నలతో వచ్చినవారు.. వారు ఏ సంప్రదాయక సూత్రాలకూ కట్టుబడి లేరు. తామే ప్రశ్నలు వేసుకుంటూ, తామే జవాబులు ఇచ్చేందుకు గడచిన నాలుగు వారాలుగా ఈ ధర్నా వేదిక వారికి ఉపయోగపడింది. ఆ నిరసన గురించి సోషల్ మీడియాలో విశేషంగా ప్రచారమయింది. మూడు వారాలకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై యువత ఎంత ఆందోళన చెందిందో ప్రత్యామ్నాయ మీడియా సాధనాల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేదని, అందుకే తమకు ప్రత్యామ్నాయం అంటూ ఏమీ లేదని, తాము ఏమి చేసినా చెల్లుతుందని విశ్వసించిన మోదీ సర్కార్.. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావాన్ని తక్కువ అంచనా వేసినట్లే కనిపిస్తోంది. సాగునీటి చట్టాలపై రైతులు, పౌరసత్వ సవరణ చట్టంపై ముస్లింలు సుదీర్ఘకాలం చేసిన నిరసన ప్రదర్శనలను మోదీ ప్రభుత్వం అవలీలగా ఎదుర్కోగలిగింది. తమపై జరిగిన అత్యాచారాల్ని ప్రశ్నించిన మహిళా మల్లయోధుల ఆక్రందననూ ఆలకించలేదు. దేశంలో ఏ ఉద్యమం జరిగినా దాని విశ్వసనీయతను దెబ్బతీసేందుకు రకరకాల మార్గాలను అవలంబించింది. ఆందోళనకారులను రకరకాల పేర్లతో దుయ్యబట్టింది. ఇప్పుడు పోటెత్తిన యువత ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా భావించి, దాన్ని అణచివేస్తే సరిపోతుందని మోదీ సర్కార్ భావించింది. కాక్రోచ్ పార్టీ నిరసన ప్రదర్శన తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చాను తొలగించి ఆయన స్థానంలో ఇప్పటి వరకూ స్పెషల్ డైరెక్టర్ (ఇంటెలిజెన్స్)గా ఉన్న అనురాగ్ కుమార్‌ను నియమించారు. జమ్మూ-కశ్మీర్ డెస్క్ ఇన్‌చార్జిగా ఆయన.. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను విచ్ఛిన్నం చేయడంలో కీలకపాత్ర పోషించారు. అలాంటి వ్యక్తి అదే మనస్తత్వంతో యువతీ యువకుల ఆందోళనను అణచివేసే ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు.

యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా నిర్భయ అత్యాచారానికి వ్యతిరేకంగా యువతీ యువకులు వీధుల్లోకి వెల్లువెత్తారు. అయితే నాడు సోషల్ మీడియా ఇప్పుడున్నంత ప్రభావవంతంగా లేదు. సోషల్ మీడియా ఇవాళ ప్రజలకు ప్రత్యామ్నాయ మీడియాగా మారిందనడంలో సందేహం లేదు. నిజానికి మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ ఐటీ సెల్ ప్రజలను సంఘటితం చేసేందుకు, ముఖ్యంగా హిందువుల భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు రకరకాల ప్రచారాలు చేసింది. ముఖ్యంగా వాట్సాప్ యూనివర్సిటీలను అధికంగా ఉపయోగించుకుంది. ఇప్పుడు జెన్ జీ తరం చేతుల్లో ఉన్న సోషల్ మీడియా ముందు ఆ ఐటీ సెల్ ప్రచారాలు వెలవెలబోతున్నట్లు కనిపిస్తోంది. ఏ ప్రచారమైనా ప్రజల మనోభావాలకు తగ్గట్లు లేకపోతే ఎక్కువ కాలం నిలబడదని ఈ పరిణామం రుజువు చేస్తోంది.

మోదీ ఏ వాగ్దానాలతో ప్రజల ముందుకు వచ్చారో ఆ వాగ్దానాలు తెరమరుగుకావడం, భావోద్వేగ అంశాలే ప్రధాన అజెండాగా మారడం, నేటి తరం గమనించకపోలేదు. ఉద్యోగాలు కల్పించకపోవడం సరే, కనీసం పరీక్షల్ని సవ్యంగా నిర్వహించలేకపోవడం, నాణ్యమైన విద్యను అందించలేకపోవడం, అధికారమే పరమావధిగా అనేక కుతంత్రాలకు, అధర్మ యుద్ధాలకు పాల్పడడాన్ని వారు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెస్‌ను నేటి తరం నెత్తికెక్కించుకుంటోందని చెప్పడానికి ఆధారాలు ఏవీ లేవు. ఒక దశాబ్దకాలంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు మోదీ పట్ల ప్రజా వ్యతిరేకత రగిలించడంలో విఫలమయ్యాయన్నది సందేహాతీత వాస్తవం. అయితే ప్రతిపక్షాలు విఫలమైన చోట యువత బయలుదేరుతుందని ఎవరూ ఊహించలేదు. కాంగ్రెస్ పార్టీయే బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించి, యువత ఆకాంక్షల్ని ప్రతిఫలించి ఉంటే కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఉండేది కాదు. మోదీని ఎదుర్కోవడంలో విఫలమైన అనేక శక్తులు ఇప్పుడు కాక్రోచ్ దండులో కనపడడం ఆసక్తికరమైన విషయం.

విచిత్రమేమంటే పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు ప్రభుత్వం ప్రవేశపెట్టదలుచుకున్న బిల్లుల గురించి కానీ, ప్రతిపక్షాలు లేవనెత్తదలుచుకున్న సమస్యల గురించి కానీ జనం పట్టించుకోలేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన 'చలో సంసద్' పిలుపునకే ఎంతో ప్రాచుర్యం లభించింది. ఒక రకంగా ఈ పరిణామం ప్రభుత్వ అస్తిత్వాన్నే కాదు, ప్రతిపక్షాల అస్తిత్వాన్ని కూడా ప్రశ్నార్థకం చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాపై ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు యువతపై లాఠీచార్జి జరగడం గురించి గగ్గోలు పెట్టడం కానీ, ప్రధానమంత్రి నివాసం ఎదుట రాహుల్‌గాంధీ ధర్నా చేయడం కానీ కాంగ్రెస్ తన అస్తిత్వాన్ని నిరూపించుకోవడంలో భాగమే. కాక్రోచ్ జనతా పార్టీ అనుభవంతోనైనా కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా పునరుత్థానం చెందుతుందా లేదా అన్నదానికి కాలమే సమాధానం చెబుతుంది. మోదీకి కూడా ప్రతిపక్షం ఎంతో కొంత ఉనికిలో ఉండడమే శుభప్రదం. లేని పక్షంలో కాక్రోచ్ జనతా పార్టీలాంటివి మరిన్ని పుట్టే అవకాశాలున్నాయి.

నైతిక బాధ్యత అన్నది నేటి కాలంలో ఒక వినకూడని అపశబ్దంగా మారింది. బడ్జెట్ లీక్ అయినందుకు మొత్తం మంత్రివర్గంతో రాజీనామా చేయించిన ఎన్టీఆర్ వంటి నేతలు కానీ, రైలు, విమాన ప్రమాదాలకు బాధ్యత వహించి రాజీనామా చేసే మంత్రులు కానీ నేడు లేరు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అస్తమానం ఎన్నికల్లో పార్టీ గెలిచేందుకు ఉపయోగించుకున్నప్పుడు ఆయన తన మంత్రి పదవీ బాధ్యతలపై ఎలా దృష్టి సారించగలరు? బిహార్, హరియాణా, బెంగాల్‌లో బీజేపీ గెలిచేందుకు సమర్థంగా వ్యూహరచన చేసిన ధర్మేంద్ర ప్రధాన్... తన మంత్రిత్వ శాఖను సమర్థంగా నిర్వహించని మాట నిజమే. అయితే ఆ తప్పు పూర్తిగా ఆయనది కాదు. ఎన్నికల్లో తమ పార్టీ గెలవడమే జీవన్మరణ సమస్యగా భావించి, అన్ని శక్తియుక్తులను ఆ దిశగా మళ్లించడమే ధర్మేంద్ర ప్రధాన్ లాంటి నేతల వైఫల్యానికి కారణం. ఇప్పటికైనా జరిగిన తప్పులకు బాధ్యత వహించడానికి, వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పెంచడానికి మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందా?

# విద్యార్థుల సహనానికి పరీక్షలు!

పరీక్షకు మునుపే 'నీట్' యూజీ ప్రశ్నపత్రం బయటికి రావడంపై పెల్లుబికిన నిరసనలు, ఇరవై లక్షల మందికి పైగా విద్యార్థులను అవస్థల పాల్జేసిన వ్యవస్థాగత లోపాలపై అధికారవర్గాల నుంచి జవాబుదారీతనాన్ని ఆశిస్తూ యువత చేపట్టిన ఆందోళనలతో దేశ రాజధాని వీధులు హోరెత్తాయి. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నవారిపై దిల్లీ పోలీసులు విచక్షణారహితంగా బలప్రయోగానికి దిగిన దృశ్యాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ మొన్న ఎన్డీయే ఎంపీల సమావేశంలో స్పందిస్తూ నీట్ పేపర్ లీకేజీని 'ఘోర పాపం'గా అభివర్ణించారు. అది అక్షరాలా సత్యం! బోలెడంత డబ్బు పోసి శిక్షణ పొంది, రేయింబవళ్లు కష్టపడి చదివి, దూరాభారాలు ప్రయాణించి ఎంతో ఒత్తిడిలో పరీక్షలు రాసే విద్యార్థుల కలలను చిదిమేయడమంటే అది ఎంతమాత్రం క్షమార్హం కాని నేరం! ప్రధాని పేర్కొన్నట్లుగా యువత భవితతో ఆడుకునేవారిని కచ్చితంగా కఠినంగా శిక్షించాల్సిందే. పోటీ పరీక్షలు, ప్రభుత్వోద్యోగాలకు ఎంపికలపై ప్రజావిశ్వాసాన్ని పెళ్లగిస్తూ, నవతరాన్ని తీవ్ర నిస్పృహలోకి నెడుతున్న పేపర్ లీక్‌లను అరికట్టడానికి కేంద్రం, రాష్ట్రాలు తప్పనిసరిగా కలిసి పనిచేయాల్సిందే! 'నీట్' ప్రశ్నపత్రాలు మళ్లీమళ్లీ లీక్ అవుతున్నా యంత్రాంగం అప్రమత్తం కాకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఇటీవలే ఆగ్రహం వ్యక్తంజేసింది. పరీక్ష నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యాన్ని కూడా సహించరాదని, అలాంటిది ఏదైనా జరిగితే సంబంధిత వ్యక్తులపై గట్టి చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు లోగడ స్పష్టీకరించింది. కానీ, బాధ్యతపట్టని అధికారగణాల పుణ్యమా అని దేశీయంగా పలు కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలు, సర్కారీ కొలువుల నియామక ప్రక్రియల్లో అనైతిక వ్యవహారాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఒక పరిశీలన ప్రకారం, 2014 2024 మధ్యలో జాతీయస్థాయి సంస్థలు, 17 రాష్ట్రాల విభాగాల ఆధ్వర్యంలో జరిగిన 89 పరీక్షలు పెనువివాదాల్లో చిక్కుకున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల పరీక్షలను ముందే నిలిపేయడం, పెట్టిన ఎగ్జాములను రద్దుచేసి మళ్లీ నిర్వహించడం, ఎఫ్ఐఆర్‌లు నమోదుకావడం వంటివి పదేపదే చోటుచేసుకున్నాయి. దాదాపు ఆరున్నర కోట్ల మంది యువతను ఇబ్బందుల పాల్జేసిన ఆ అక్రమాల నుంచి ప్రభుత్వాలు గుణపాఠాలు నేర్చుకుని ఉంటే 'నీట్' ఉదంతాల వంటివి ఎందుకు పునరావృతమవుతాయి? పోటీ పరీక్షల సమర్థ నిర్వహణకుగానూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అనుసరించాల్సిన విధివిధానాలను పార్లమెంటరీ స్థాయీసంఘం, కె.రాధాకృష్ణన్ కమిటీ ఇప్పటికే నివేదించాయి. వాటిని పూర్తిగా అమలు చేయడంలో సంబంధిత వర్గాలు ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల్లోంచి ఆయా కోర్సులకు తగిన ప్రతిభావంతులను ఎంచడానికి ఉద్దేశించిన పరీక్షలకు చైనా, దక్షిణాకొరియా తదితర దేశాలు అమిత ప్రాధాన్యమిస్తాయి. వాటిలో మోసాలను ప్రజా వ్యవస్థలపై చేసే తీవ్రమైన దాడులుగా పరిగణించి, వేగంగా విచారణలు జరిపి నేరగాళ్లను తగిన విధంగా శిక్షిస్తాయి. తద్భిన్నమైన పరిస్థితులు రాజ్యమేలుతున్న భారతావనిలో మాత్రం 20022025 మధ్యకాలంలో 45 పెద్ద పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు వెలుగుచూస్తే రెండు కేసుల్లోనే అపరాధులకు శిక్షలు పడ్డాయి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# అంగన్‌వాడీల్లో అలజడి

- గ్యాస్ సిలిండర్ల జాడేది ?
- కరెంట్ స్టవ్‌ల నాటకం ప్రభుత్వ ధనం బూడిద...
- పిల్లల మెనూకు మంగళం పసిపిల్లల నోటికాడ దొంగతనం...
- సిడిపిఓ నిద్రమత్తు – సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం...
- బాధ్యత శూన్యం – బ్లాక్‌మైల్ నంబర్ 1...

**ధర్మవరం ఆగష్టు 4 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు పరిమితులు దాటుతున్నాయి. పసిపిల్లలు, గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారం లబ్ధిదారులకు దక్కకుండా సిబ్బంది స్వాహా చేస్తున్నారు. ప్రభుత్వం పసిపిల్లలు, గర్భిణీలు, బాలింతల, ఆరోగ్యాన్ని కాపాడేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెల కోట్ల రూపాయలు హెచ్చిస్తూ బియ్యం, పప్పులు, గుడ్లు, పాలు, పోషకాహారం సరఫరా చేస్తుంది. పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలని కూడా అమలు చేస్తుంది.

అయితే ధర్మవరం పట్టణంలోని పలు అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సేవలు ఉండడం లేదు. అయితే అంగన్వాడివి లోపాలు జరిగేది మాత్రం వేరే లెవెల్ పిల్లలకు దక్కాల్సిన పోషకాహారం ఎక్కడికి పోతోంది.

**మెనూలో ఒకటి మనలో మరొకటి...!**

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వారంలో గుడ్లు ఆహార పదార్థాలు అందించాల్సి ఉన్నప్పటికీ కొన్ని కేంద్రాలలో అవి పూర్తిగా అమలు కావడం లేదు. "ఆకలికి అన్నమే ఔషధం " అంటారు. అలాంటి సమయంలో పసి పిల్లలకు అందాల్సిన పోషకాహారమే సక్రమంగా అందకపోతే వారి ఎదుగుదల పై ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పోషకాహారం చీమలకి.. ఆఫీసర్ల పర్యవేక్షణ దేవుడికి..**

పాత స్టాక్ అంతా అక్కడ మూలుగుతూ చీమలు పడుతుంటే కొత్త స్టాక్ ఎలా రిలీజ్ అవుతుంది? పాత నిల్వను పక్కదారి పట్టించడం లేదా మురిగిపోయేలా చేసి కొత్త స్టాక్ పేరుతో రికార్డులను మాయం చేయడం ఇక్కడ నడుస్తున్న అసలు గేమ్. పసిపిల్లల పాల ప్యాకెట్లను చీమలకు మేతగా వేస్తున్నారు కానీ అసలైన లబ్ధిదారులకు మాత్రం చుక్క పాలు ఇవ్వరు. కేంద్రాలకు సరఫరా అవుతున్న బియ్యం పప్పులు ఇతర సరుకులు నిల్వలు అక్రమంగా వినియోగించకుండా మూలలోనే పేరుకు పోతున్నాయి పాత స్టాక్ వివరాలు పూర్తిగా నమోదు చేయకుండానే కొత్త కొత్త సరుకులు తీసుకుంటూ స్టాక్ రిజిస్టర్లు వాస్తవ నిల్వలను సంబంధిత అధికారులు కనీసం ఆ దరిదాపుల్లోకి రావడం లేదు.



**వంట ఇండక్షన్ మీద.. గ్యాస్ ప్రైవేట్ ఇంట్లో!**

అసలు గ్యాస్ సిలిండర్లు ఎక్కడికి పోయాయి? ఇంకేం రికార్డుల్లో కేంద్రానికి గ్యాస్ సిలిండర్ ఉంటుంది కానీ ఇక్కడ కేంద్రాలలో సిలిండర్లు ఉండవు ప్రైవేట్ అడ్రస్సులలోనూ లేక ఇళ్లల్లోనూ వెలుగుతుంటాయి. ఈ ఇండక్షన్ స్టవ్ల గోల వెనక పెద్ద స్కెచ్ ఉంది.., ఇంత కరెంట్ కాలుతోంది ఎంత ఆహారం వృధా అవుతుందో అనేదానికి లెక్క పత్రం ఉండదు. తక్కువ మంది పిల్లలు ఉంటే ఎక్కువమంది ఉన్నట్టు రికార్డు రాయడం ఉన్నంత వండి సగం మేసేయడం వంట రోజు వారి రోటి మాఫియా? మరి టీచర్లు కూర్చుని ప్లేట్లతో లాగించేయడానికి ఏ జీవో పర్మిషన్ ఇచ్చింది అడిగితే నవ్వుతూ "మేమూ తింటాం" సమాధానం చెప్పే పొగరు ఎక్కడి నుంచి వచ్చింది అడిగే ఆఫీసర్లు లేరనే ధీమా కాకపోతే ఇంకేంటి...!

### సర్కారు లెక్కలు గాల్లో.. అసలు మాయాజాలం సెంటర్లలో!

**రిపోర్టుల్లో అంతా సవ్యంగా ఉందంటూ ఆఫీసర్లు కాగితాలు చూపిస్తున్నా, అసలు దోపిడీ దందా అంతా అంగన్‌వాడీ సెంటర్ల నాలుగు గోడల మధ్యే జరుగుతోంది. సిడిపిఓ అసలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వ్యవస్థ కళ్ళు మూసుకుంటే అంగన్వాడీ సిబ్బంది రెండు చేతులా లాగేస్తున్నారు. ప్రభుత్వం నుంచి పథకాలు వస్తున్నాయి నిధులు వస్తున్నాయి కానీ పసిపిల్లలు కడుపు మాత్రం ఖాళీగానే ఉంటుంది ఇది కేవలం నిర్లక్ష్యం కాదు అంగన్వాడీల పేరుతో జరుగుతున్న బహిరంగ అక్రమ కాండ.!**




### ఖేల్ ఖతం దుకాణం బంద్ అయ్యేది ఎప్పుడు?

సూపర్వైజర్లు కనీసం ఆ దారిదాపుల్లో కనిపించరు. సిడిపిఓ ఆఫీస్ దాటు బయటకు రారు. నెలాఖరికి జీతాలు, కమిషన్లు అయితే చాలు అనే ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది. పసిపిల్లల నోటి కాడ కూడు లాక్కుంటున్న ఈ ఐసీడీఎస్ ఆ బంధువులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు చేపట్టకపోతే, ఈ సిస్టమ్ పై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోతుంది.










## భవన నిర్మాణ అనుమతుల సరళీకరణతో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం



- మంత్రి నారాయణను సన్మానించిన క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు

**అమరావతి ఆగస్టు 04,అనంత జనశక్తి న్యూస్**

**భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ పురపాలక శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెం.161ను స్వాగతిస్తూ క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ (CREDAI AP) ప్రతినిధులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.భవన నిర్మాణ అనుమతుల నిబంధనలను సరళీకరించడంలో మంత్రి నారాయణ కీలక పాత్ర పోషించారని క్రెడాయ్ ప్రతినిధులు అభినందించారు. సెల్ఫ్ డిక్లరేషన్ విధానం అమలు, సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు, అనుమతుల ప్రక్రియలో తీసుకొచ్చిన సంస్కరణలు నిర్మాణ రంగానికి ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ నాయకత్వంలో రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని, దీంతో పరిశ్రమలో పెట్టుబడులు, నిర్మాణ కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతున్నాయని క్రెడాయ్ ప్రతినిధులు వెల్లడించారు.ఈ సందర్భంగా తిరుపతి, రాజమండ్రిలో త్వరలో నిర్వహించనున్న క్రెడాయ్ ఎక్స్‌పో కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి నారాయణను వారు ఆహ్వానించారు.అలాగే, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (KUDA) మాస్టర్ ప్లాన్‌ను త్వరితగతిన ఖరారు చేయాలని క్రెడాయ్ ప్రతినిధులు మంత్రిని కోరారు.ఈ సమావేశంలో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ బుద్దిగ శ్రీనివాసు, జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.**

## విద్యార్థులు సైబర్ నేరాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



- జిల్లా ఎస్పీ పి. జగదీష్ పిలుపు

**అనంతపురం ఆగస్టు 04, అనంత జనశక్తి న్యూస్**

సమాజంలో పెరుగుతున్న నేరాల పట్ల విద్యార్థులు, యువత అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పిలుపునిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పోలీసు అధికారులు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పోలీసు అధికారులు మాట్లాడుతూ... నేటి యువతే దేశ భవిష్యత్తు అని, ప్రశాంతమైన జీవితానికి సరైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు.

**సమావేశాల్లో అధికారులు వెల్లడించిన ముఖ్యాంశాలు :**

మహిళా భద్రత, హెల్ప్‌లైన్లు : విద్యార్థినులు ఈవ్ టీజింగ్, వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే స్పందించాలని కోరారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, శక్తి యాప్ ద్వారా పోలీసు సహాయం ఎలా పొందాలో విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ రహిత సమాజం : సోషల్ మీడియా వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని హెచ్చరించారు.

గంజాయి, మత్తు పదార్థాల వంటి వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.బాల్య వివాహాలు, ట్రాఫిక్ నిబంధనలు: చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిరోధంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో సంబంధిత ప్రాంతాల పోలీసు అధికారులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ।
- ఘనంగా... పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ డే వేడుకలు

**అనంతపురం ఆగస్టు 04 అనంత జనశక్తి న్యూస్**

పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ వెల్లడించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఈరోజు పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రయివేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ పాఠశాలను నిర్వహించడం జరుగుతోందన్నారు.విద్యతో పాటు సైకర్యాలు కూడా మెరుగ్గానే ఉన్నాయన్నారు. ఆర్డీటీ వారి సహకారంతో స్పానిష్ లాంగ్వేజ్ కూడా అదనంగా పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. చిన్న వయస్సులో అయితే మంచిగా నేర్చుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకునే వీలుంటుందన్నారు. చదువులతో పాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. బాల్యం నుండే చదువుతో పాటు క్రీడలు, ఆటలకు అలవాటు పడేలా ఇటు ఉపాధ్యాయులు... అటు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, సిబ్బందిని ఎస్పీ సన్మానించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, డిస్కవరి అనంతపురం సంస్థ నిర్వాహకులు అనిల్, ఆర్ ఐ లు పవన్ కుమార్ , రాముడు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు.



## తెలుగుజాతి గర్వించేలా అమరావతి

**అమరావతి ఆగస్టు 04, అనంత జనశక్తి ప్రతినిధి**

తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేశ్ తో ఆయనకేంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై మంత్రులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న ఉన్నత విద్యావంతుడితో మంత్రి నారా లోకేశ్ తో ఆయనకు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా..? అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు పలికారు.

**2028 నాటికి అమరావతి సిద్ధం : మంత్రి సవిత**

తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు.

**జగన్ ది విధ్వంసం... మాది అభివృద్ధి...**

ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని , తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్ ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు. నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఏడాదికి రూ.25 లక్షలు సంపాదించుకోవచ్చు

- జర్మనీ, జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు
- మంత్రి వివేక్ వెంకటస్వామి
- జర్మన్, జపనీస్ భాషలపై పట్టు సాధిస్తే చాలు
- జర్మనీలో ఇప్పటికే 5 లక్షల ఖాళీలు
- త్వరలోనే జపాన్ పర్యటన ద్వారా మరిన్ని..

**హైదరాబాద్, ఆగస్టు 4, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణలోని నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను బట్టి మన విద్యార్థులు సరైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే నెలకు లక్షల రూపాయల వేతనాలు పొందే సువర్ణావకాశం ఉందన్నారు. ఇటీవల తాము చేపట్టిన విదేశీ పర్యటనలు, అక్కడ పరిశీలించిన పరిస్థితుల ఆధారంగా యువతకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. కొన్ని రోజుల క్రితం తాము జర్మనీలో జరిపిన పర్యటన ఎంతో విజయవంతమైందని.. ఒక్క జర్మనీ దేశంలోనే ప్రస్తుతం వివిధ రంగాల్లో దాదాపు 5 లక్షల ఉద్యోగావకాశాలు ఖాళీగా ఉన్నాయని మంత్రి వివేక్ వెల్లడించారు. అక్కడ భారతీయ యువతకు, నైపుణ్యాలు కలిగిన వారికి విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇన్ని అవకాశాలు వేచి ఉన్న నేపథ్యంలో మన యువత సాంప్రదాయ ఆలోచన ధోరణి నుంచి బయటపడి, గ్లోబల్ కెరీర్ దిశగా అడుగులు వేయాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలంటే చదువుతో పాటు సంబంధిత దేశాల భాషలపై పట్టు సాధించడం అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు.

'కొన్ని రోజుల క్రితం మేం జర్మనీ వెళ్లాం. జర్మనీలో 5 లక్షల ఉద్యోగ అవకాశాలు ఉన్నయ్. ఈనెల 23న మేం జపాన్ పోతున్నాం. అక్కడ కూడా ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నయ్. ఇన్ని ఉద్యోగ అవకాశాలు ఉన్నయ్ కాబట్టి యువత ఆలోచించాలి. మన పిల్లలు బాగా చదువుకోవాలి. అక్కడ కూడా ఉద్యోగాలు చేసుకోవచ్చు. అలా చేస్తే తెలంగాణలో నిరుద్యోగత కూడా తక్కువైతది. ఎక్కువ మంది విదేశాలకు పోయినప్పుడు.. ఇక్కడ ఉన్నవాళ్లకు ఉద్యోగాలు దొరుకుతయ్. అందుకు ప్రభుత్వాలు, పలు సంస్థలు పని చేస్తయ్. మేం జర్మనీలో, జపాన్‌లో కల్పించే ఉద్యోగాలకు భారీ జీతం ఉంటుంది. సుమారుగా రూ.2.50 లక్షల వరకు జీతం ఉంటుంది. ఎవరైతే చక్కగా జర్మన్, జపనీస్ లాంగ్వేజ్ నేర్చుకుంటారో వారికి నెలకు రూ.2 లక్షలకు పైగానే జీతం లభిస్తుంది. మీరు సంవత్సరానికి రూ.25 లక్షల రూపాయులు సంపాదించుకోవచ్చు.' అని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. మన పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని, నాణ్యమైన విద్యతో పాటు విదేశీ భాషలను నేర్పించడంలో శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

# హరీశ్‌రావు క్షుద్రపూజలు చేస్తున్నారు



- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 4, అనంత జనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా.. పంటలు పండకుండా కరువు పరిస్థితులు ఏర్పడాలని హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. తాను చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొనడం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఈ ఏడాది జూన్ 2వ తేదీన తమిళనాడులోని తిరుచ్చి.. జూలై 23వ తేదీన కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతాలను హరీశ్‌రావు సందర్శించారని.. మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుచ్చి, శివమొగ్గలో క్షుద్ర పూజలు నిర్వహించే ఆలయాలు ఉన్నాయని పేర్కొన్న టీపీసీసీ చీఫ్.. ఆ పర్యటనలపై హరీశ్‌రావు వివరణ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలు కష్టాల్లో పడాలని.. కరువు రావాలని కోరుకుంటూ రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ ప్రజలకు నష్టం కలగాలని కోరుకోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఇక మాజీ సీఎం కేసీఆర్‌పైనా గతంలో ఇలాంటి ప్రచారం జరిగిందని గుర్తు చేసిన మహేష్ కుమార్ గౌడ్.. ఇప్పుడు హరీశ్‌రావుపై వస్తున్న ఆరోపణలు ఆ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి చేసిన పూజల గురించి కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో.. ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తిన కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపినా తాము వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాగా.. టీపీసీసీ చీఫ్ చేసిన ఈ ఆరోపణలపై హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# భారీగా కల్తీ మసాలా

**హైదరాబాద్, ఆగస్టు 4, అనంత జనశక్తి న్యూస్**




గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్లపై పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపారు. హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్, జీహెచ్ఎంసీ ఆహార భద్రతా విభాగం సంయుక్తంగా నిర్వహించిన భారీ తనిఖీల్లో ఏకంగా 25,300 కిలోలకు పైగా కల్తీ మసాలా దినుసులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మసాలా దినుసులు ఆకర్షణీయంగా కనిపించేందుకు, వాటి బరువును కృత్రిమంగా పెంచేందుకు వ్యాపారులు అత్యంత ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దుస్తులకు వేసే కలర్లు, ఇండస్ట్రియల్ రంగులు, పౌడర్, సింథటిక్ రంగులను విస్తృతంగా వాడారు. నాణ్యత లేని దినుసుల రూపురేఖలను మార్చి ప్రకాశవంతంగా చూపించడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ బరువు వచ్చేలా చేసి అధిక లాభాలు గడించడం చేస్తుంటారు కల్తీ రాయుళ్లు. అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో లభ్యమైన కల్తీ మసాలా దినుసులు, వాటి పరిమాణం భారీ మొత్తంలో ఉంది. వాము 7,920 కేజీలు, జీలకర్ర 6,700 కేజీలు, ఆవాలు 4,960 కేజీలు, జీలకర్ర పొడి/డస్ట్ 2,350 కేజీలు, షాజీరా 2,280 కేజీలు, లవంగాలు 550 కేజీలు, సోంప్ 540 కేజీలు.. అంతేకాకుండా ఈ కల్తీ దినుసుల తయారీకి ఉపయోగించే 89,150 కిలోల రా మెటీరియల్‌ను (రసాయనాలు, రంగులు మొదలైనవి) కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రాణాంతకమైన ఫ్యాబ్రిక్ డైలు, కెమికల్స్ కలిపిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు, జీర్ణకోశ సంబంధిత తీవ్ర రుగ్మతలు వస్తాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఈవీఎంల భద్రతపై రాజీ లేదు

- కలెక్టర్ అంకిత్
- కొత్తగూడెం ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ
- భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 4, అనంత జనశక్తి న్యూస్**




కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా గోడౌన్లను తనిఖీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమైన అంశమని, అందుకు అనుగుణంగా అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను

ఎట్టి పరిస్థితుల్లోనూ గోడౌన్‌లోకి అనుమతించరాదని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతినెల ఒకటినే జీతం ప్రజాప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనం...


- ఒకేషనల్ జూనియర్ కళాశాలల అధ్యాపకులు
- జనగామ డీఐఈఓ కి ఘన సన్మానం
- చరిత్రలో మొట్టమొదటి సారిగా జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఉద్యోగులకు జీతాలు ఒకటినే పడటం తో సంబరాలు.

**జనగామ ఆగస్టు 04 అనంత జనశక్తి న్యూస్**



ప్రతి చిరు ఉద్యోగి కూడా ప్రతి నెల ఒకటినే జీతాలు అందుకోవాలని రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ నేపద్యం లో చరిత్రలో మొట్టమొదటి సారిగా జిల్లాలోని అన్ని ఇంటర్ విద్యా కళాశాలలలో పనిచేస్తున్న అందరికీ ఆగస్టు 1వ తేదీని జీతాలు పడేలా ప్రత్యేక చొరవ చూపిన జనగామ జిల్లా ఇంటర్ విద్య అధికారి కల్లూరి జితేందర్ రెడ్డి ని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఐఈఓ నీ శాలువాతో సత్కరించి ,పుష్ప గుచ్ఛాన్నీ అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ గెస్ట్ ఔట్ సోర్సింగ్ తో పాటు ప్రతీ చిరుద్యోగి ఇంటికి ఒకటవ తేదీనే పండగ తెచ్చిన ఇంటర్ విద్యా అధికారులకు, ఆఫీసు సిబ్బందికి భోజన విరామ సమయం లో ఒకేషనల్ అధ్యాపకులు మిఠాయిలు పంచారు. ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు మరిపెల్ల రవి ప్రసాద్, కదిర రవీందర్ ,బిల్లా శంకర్ తదితరులు మాట్లాడుతూ ప్రతినెల ఒకటి నీ జీతం అందరికీ అందించడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనం అన్నారు. రెగ్యులరైజేషన్ విషయంలో గత ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందని ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. సాంక్షన్ పోస్టు అనేవి యాజమాన్యం బాధ్యత అని తమకు సంబంధం లేని విషయాలను తమపై రుద్దుతూ తమ యొక్క రెగ్యులరైజేషన్ను గత ప్రభుత్వం ఆపివేసిందన్నారు. న్యాయం కోసం హైకోర్టు మరియు సుప్రీం కోర్టులను ఆశ్రయించి ఆర్టికల్ 14 ఫలాలు అందరికీ దక్కాలని కోర్టులలో న్యాయ పోరాటాలు చేస్తున్నట్టు ఈ సందర్భంగా ఒప్పంద అధ్యాపకులు జితేందర్ రెడ్డి కి తెలియజేశారు. ఒకేషనల్ విభాగంలో ఒకే లెక్చరర్ ఉన్నచోట మరొక గెస్ట్ ను నియమించాలని కోరారు. ఈ సందర్భంగా డిఐఈఓ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీతం తీసుకోవడం హక్కని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి మరింత బాధ్యతతో పనిచేసే రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటు పడాలని సూచించారు. ఇంటర్ విద్యలో పనిచేస్తున్న ఒకేషనల్ అధ్యాపకులకు న్యాయం జరుగుతుందని న్యాయస్థానాల తీర్పులు వచ్చేంతవరకు ఓపికతో ఉండాలని ఒప్పంద అధ్యాపకులకు సూచించారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందరి జీతాలు ఆగస్టు ఒకటిన క్రెడిట్ అయ్యేందుకు ప్రిన్సిపాల్ మరియు నాట్ టీచింగ్ సిబ్బంది సహకరించారని మొట్టమొదటిసారిగా ఒకే రోజున అందరి జీతాలు రావడం ఈ ప్రజా ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. ఈ సందర్భంగా ఒప్పంద అధ్యాపకులు జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ప్రిన్సిపాల్ మరియు నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు అధ్యాపకులు పరిక మంజుల, ఓశపాక మీనా ,నందగిరి కృష్ణవాణి. తదితరులు పాల్గొన్నారు.





# పుష్కరాల నాటికి ఆలయ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 4, అనంత జనశక్తి న్యూస్ :**

వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయంలో జరుగుతున్న పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను ముక్కోటి ఏకాదశి నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించిన కలెక్టర్, అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆలయం చుట్టూ కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించి, ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని, నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు కాలినడకన పరిశీలించిన కలెక్టర్, పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ, పాదచారుల మార్గాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ట్రాఫిక్ నిర్వహణ తదితర సౌకర్యాలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

చిత్రకూట మండపంలో జరుగుతున్న తొలగింపు పనులను పరిశీలించిన ఆయన, పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో పనులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులకు ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పనుల పురోగతిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ రవికుమార్, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోవడం ఆందోళనకరం




- ఫెర్టిలిటీ చికిత్సల్లో పారదర్శకత, రోగుల హక్కులపై అవగాహన పెరగాలి: నిపుణులు

**హైదరాబాద్, ఆగస్టు 4:అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలో మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రతి మహిళకు సగటున 1.5 పిల్లలకు పడిపోవడంతో ఫెర్టిలిటీ సంరక్షణలో పారదర్శకత, నైతిక ప్రమాణాలు, రోగుల హక్కులపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఈ మేరకు నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో "బియాండ్ ఐవీఎఫ్: బిల్డింగ్ ట్రస్ట్, ఎథిక్స్ అండ్ అవేర్‌నెస్ ఇన్ అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ)" అంశంపై ప్యానెల్ చర్చ నిర్వహించారు. నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ క్లినికల్ డైరెక్టర్, ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ హిమ దీప్తి మోడరేటర్‌గా వ్యవహరించిన ఈ చర్చలో పంజాగుట్ట ఏసీపీ మురళీ కృష్ణ, నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సీఈఓ శోభిత్ అగర్వాల్, సీనియర్ మెడికోలీగల్ నిపుణులు డాక్టర్ గీతేంద్ర శర్మ, న్యూస్‌మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కనిజా గరారీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఐవీఎఫ్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అక్రమాలకు ఆస్కారం లేకుండా అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021 కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశంలోని అన్ని ఫెర్టిలిటీ కేంద్రాలు ఈ చట్టానికి సంబంధించిన వివరాలను తమ కేంద్రాల్లో స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు, రోగులకు వారి హక్కులు, చట్టం కల్పించే రక్షణలపై అవగాహన కల్పించాలని సూచించారు. నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సీఈఓ శోభిత్ అగర్వాల్ మాట్లాడుతూ, చట్టం అమలులో ఉన్నప్పటికీ రోగులు తమ హక్కులను తెలుసుకుని, పారదర్శక సమాచారం ఆధారంగా చికిత్సకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. నైతిక ఫెర్టిలిటీ సేవలతో పాటు రోగులకు అవగాహన కల్పించడం కూడా తమ బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ మెడికోలీగల్ నిపుణులు డాక్టర్ గీతేంద్ర శర్మ మాట్లాడుతూ, ఏఆర్‌టీ చట్టం రోగుల సమ్మతి, గోప్యత, పారదర్శక డాక్యుమెంటేషన్, క్లినిక్‌ల జవాబుదారీతనం వంటి అంశాలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తోందన్నారు. ఫెర్టిలిటీ చికిత్స పొందే ప్రతి జంట తమ హక్కులు, చట్టపరమైన నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యూస్‌మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కనిజా గరారీ మాట్లాడుతూ, సంతానలేమికి సంబంధించిన శాస్త్రీయ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, అపోహలను తొలగించడం, అవగాహన పెంచడం మీడియా బాధ్యత అని పేర్కొన్నారు. ప్యానెల్ చర్చలో ఫెర్టిలిటీ చికిత్సలు పొందే జంటలు క్లినిక్ ఏఆర్‌టీ చట్టం ప్రకారం నమోదైందో లేదో నిర్ధారించుకోవడం, చికిత్స విధానం, ఖర్చులు, విజయావకాశాలపై పూర్తి సమాచారం తెలుసుకోవడం, వైద్య, ఆర్థిక, భావోద్వేగ కౌన్సెలింగ్ పొందడం, సమ్మతి పత్రాలను పూర్తిగా చదివి సంతకం చేయడం, గోప్యత, పారదర్శకత, నైతిక ప్రమాణాలను పాటించే కేంద్రాలను ఎంచుకోవాలని నిపుణులు సూచించారు.



# ప్రోటీన్ కోసం రుచిపచి లేని ఫుడ్ తినాల్సిన అవసరం లేదు, సోయాతో రుచిగా ఇలా చేసుకుంటే బరువు పెరగరు, హెల్దీ కూడా

సోయా చంక్స్.. వీటితో చాలా మంది బిర్యానీలు, కూరలు, ఇలాంటి రెసిపీలు చేసుకుంటారు. ఇవి ఎంతో హెల్దీ. ఇందులో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది. వీటిని తినడం కొంతమందికి బోరింగ్‌గా అనిపిస్తుంది. అలాంటి వారు సోయా చంక్స్‌తో చక్కగా సరికొత్త వెరైటీ చేసుకుని తినొచ్చు. చక్కగా వెరైటీగా వీటితో కట్‌లెట్ చేసుకుని హ్యాపీగా తినొచ్చు. దీని వల్ల చక్కగా టేస్టీగా సోయాని ఎంజాయ్ చేయొచ్చు. సోయా చంక్స్ అనేవి ఎప్పుడు కూడా చప్పగా ఎలాంటి టేస్ట్ లేకుండా ఉంటాయి. కానీ, ఇప్పుడు చెప్పినట్లుగా తింటే మాత్రం రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం అందినట్లుగా ఉంటుంది.











**వేడి నీటిలో నానబెట్టడం**

ముందుగా కొన్ని సోయా చంక్స్‌ని తీసుకుని వేడి నీటిలో నానబెట్టాలి. వెంటనే తర్వాత నీటిలో నుంచి వాటిని తీసేయాలి. ఎక్కువసేపు వద్దు. ఎక్కువసేపు నానితే అవి బాగోవు. కాబట్టి, కాసేపు నానగానే వెంటనే వాటిని స్క్వీజ్ చేసి తీసేయాలి.

**పనీర్ యాడ్ చేయడం**

అలానే లో ఫ్యాట్ పనీర్‌ని తీసుకోండి. ఇందులో చక్కగా ప్రోటీన్ ఉంటుంది. దీనిని కూడా ఈ కట్‌లెట్‌లో యాడ్ చేయొచ్చు. కాబట్టి లో ఫ్యాట్ ఫ్రెష్ పనీర్ తీసుకోండి. ఇప్పుడు మిక్సీ జార్‌లో సోయా, పనీర్‌ని వేయండి. అందులోనే ఉల్లి, పచ్చిమిర్చి తరుగు మీ టేస్ట్‌కి తగ్గట్లు వేయండి. తర్వాత అల్లం కూడా వేయండి. కొత్తిమీర వేసి పేస్టులా చేయండి. మరీ మెత్తగా కాకుండా కాస్తా బరకగా మిక్సీ పట్టి ఓ గిన్నెలో తీయండి.

**బైండింగ్ కోసం**

ఇప్పుడు తయారైన సోయా మిశ్రమంలో బైండింగ్ కోసం కొద్దిగా శనగపిండి లేదా ఓట్స్ పిండి వేసి కలపండి. అందులోనే ఉడికించిన బఠానీలని 30 గ్రాముల వరకూ కొద్దిగా మెదిపి వేయండి. ఇప్పుడు తయారైన పిండిలో కసూరి మెథి, ఉప్పు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి అన్నీ కూడా రుచికి సరిపడా కలుపుకోండి. అన్నీ బాగా కలిసేలా చూడండి.

**కట్‌లెట్‌లా చేయడం**

ఇప్పుడు తయారైన పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీస్తూ టిక్కీల్లా ఒత్తండి. వీటిని కొద్దిగా నూనె వేస్తూ రెండువైపులా కాల్చండి. వీటిని వేడివేడిగా కొత్తిమీర, పుదీనా చట్నీతో ఎంజాయ్ చేయండి. ఇలా చేయడం వల్ల మీకు మంచి టేస్టీ ఐటెమ్‌ని తిన్నట్లుగా అనిపిస్తుంది. పైగా ప్రోటీన్ కూడా అందుతుంది.

**ఎందుకు ఈ రెసిపీ స్పెషల్**

ఇప్పుడు తయారైన రెసిపీలో ప్రోటీన్ ఎక్కువగా కేలరీలు తక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. ప్రోటీన్ అందుతుంది. ఇందులో కలిపిన పదార్థాలన్నీ ప్రోటీన్ ఎక్కువగా ఉండేవే. పైగా వీటిని చేయడానికి ఎక్కువగా నూనె కూడా వాడలేదు. కాబట్టి, చక్కగా తినొచ్చు. ఈజీగా జీర్ణమవుతాయి. రిఫైండ్ ఫ్లోర్ కంటే ఇలా తయారైన రెసిపీలు చాలా టేస్టీగా, హెల్దీ అని చెప్పొచ్చు.

# రొయ్యలకు నరాలు ఎందుకు తీయాలి, తీయకుండా తింటే ఏమవుతుందో తెలుసా?



సండే వచ్చిందంటే చాలు నాన్ వెజ్ ప్రియులకు పండగే. చికెన్, మటన్, చేపలు ఇలా రకరకాల వెరైటీలు తింటారు. అయితే, చాలా మందికి రొయ్యలంటే ఇష్టం. రొయ్యలు పోషకాలతో సమృద్ధిగా ఉండే సూపర్ ఫుడ్. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, రొయ్యల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి మంచిదని నిపుణులు అంటున్నారు.



రొయ్యల్లో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు గుండె జబ్బుల నుంచి రక్షిస్తాయి. రొయ్యల్లో అయోడిన్ అనే ఖనిజం పుష్కలంగా ఉంటుంది. అందుకే ఇది థైరాయిడ్ రోగులకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. రొయ్యల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యానికి చాలా అవసరం. ఇక, రొయ్యల్ని పులుసుగా, ఫ్రై చేసుకుని తింటారు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది.

ఇక రొయ్యల పచ్చడి కూడా చాలా ఫేమస్. అయితే, రొయ్యల్ని వండేటప్పుడు చాలా శుభ్రంగా క్లీన్ చేస్తారు. ముఖ్యంగా రొయ్యలకు నరాలు తీయాలని పెద్దలు చెబుతుంటారు. నరాలు తీయకుండా రొయ్యలు తినకూడదని నిపుణులు కూడా అంటున్నారు. అసలు రొయ్యలకు నరాలు ఎందుకు తీయాలి, తియ్యకుండా తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.


**రొయ్యల నరాలు ఎందుకు తీయాలి?**

రొయ్యల వెనుక భాగం వీపు వెంట డైజెస్టివ్ ట్రాక్ట్ అనే నరం ఉంటుంది. ఇది ముదురు నలుపు రంగులో ఉంటుంది. ఇది వ్యర్థాల్ని, కొన్నిసార్లు విష పదార్థాల్ని కలిగి ఉంటుంది. రొయ్యల్ని నరాలతో పాటు తినడం వల్ల ఈ వ్యర్థాలు, విష పదార్థాలు హాని చేసే అవకాశం ఉంది.

నరాలు ఉండే రొయ్యల్ని తినకూడదని అందుకే పెద్దలు చెప్పేది. ఇక, రొయ్యల నరాల్ని తొలగించడాన్ని డెవైనింగ్ అంటారు. ఇది తొలగిస్తే రుచి కూడా బాగుంటుందని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. లేదంటే వంట రుచి మొత్తం పాడవుతుంది.

**రొయ్యల నరాల్ని తీయకపోతే కలిగే ప్రభావం**

రొయ్యలు నరాలు పేగు వ్యర్థాలు, పాక్షికంగా జీర్ణమైన ఆహారం, ఇసుక లేదా గ్రిట్ కలిగి ఉండొచ్చు. దీనిని తినడం వల్ల అవాంఛిత అవశేషాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. అంతేకాకుండా జీర్ణక్రియకు ఆటంకం కలిగించవచ్చు. రొయ్యల్ని నరాలతో తినడం వల్ల అసౌకర్యం, అజీర్ణం లేదా అలెర్జీ ప్రతిచర్యలు ఎదురవుతాయి. వంట సాధారణంగా బ్యాక్టీరియాను చంపుతుంది. అయితే రొయ్యల నరం యొక్క గ్రిటీ ఆకృతి చేదు రుచిని ఇస్తుంది. నరాల్ని తొలగించడం వల్ల ఈ ప్రభావం తగ్గుతుందని నిపుణులు అంటున్నారు.



**నరాలతో ఉన్న రొయ్యల్ని తింటే ఏమవుతుంది?**

మీకు రొయ్యల వల్ల ఎలాంటి అలెర్జీ లేకపోతే.. నరాలతో ఉన్న వాటిని వండి తినడం వల్ల తక్షణమే ఎటువంటి అలెర్జీ ప్రతిచర్యలు ఉండవు. అయితే, ఆ నరంలో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు, రసాయనాలు మన జీర్ణ ఆరోగ్యంతో పాటు పేగుల్ని ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. వీటిని తినడం వల్ల కొంతమంది ఆకస్మిక దద్దుర్లు, వేడి ఆవిర్లు, గొంతులో ఊపిరి ఆడకపోవడం, గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కలగవచ్చు. కొన్నిసార్లు ప్రాణాలకే ప్రమాదం అంటున్నారు. అందుకే నరాలతో ఉన్న రొయ్యల్ని తినకూడదని నిపుణులు సలహా ఇస్తున్నారు.

**రొయ్యల్ని ఎలా క్లీన్ చేయాలి?**

రొయ్యల్ని క్లీన్ చేయడం, వేరు చేయడం అనేది ట్యాప్ ఆన్ చేసి నీటిలో కడగడం ద్వారా ప్రారంభమవుతుంది.

రొయ్యల్ని చల్లటి నీటితో శుభ్రంగా కడిగి దుర్వాసన వస్తుందో లేదో తనిఖీ చేయాలి.

అదనపు నీటిని తొలగించి.. పదునైన కత్తిని ఉపయోగించి ముందుగా రొయ్య తలను కత్తిరించండి. ఆ తర్వాత తోకను కూడా కట్ చేయండి.

చేతులతో రొయ్యల బయటి పెంకును తొలగించండి. శుభ్రమైన కత్తిని తీసుకుని రొయ్యల వంపు చుట్టూ చీలిక చేసి.. ముదురు నలుపు రంగులో ఉన్న నరాన్ని సున్నితంగా తొలగించండి.

ఆ తర్వాత రొయ్యల కాళ్ళను తీసేయండి. చివరగా చల్లటి నీటిలో కొద్దిగా ఉప్పు వేసి రొయ్యల్ని శుభ్రంగా కడుక్కోవాలి.

**రొయ్యలు తినడం వల్ల ప్రయోజనాలు**


రొయ్యల్లో గ్లైకోసమినోగ్లైకాన్ అనే బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల్ని కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల గాయాల నుంచి వచ్చే వాపు తగ్గుతుంది. రొయ్యల్ని తినడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి వల్ల కలిగే మంట కూడా గణనీయంగా తగ్గుతుంది.

బరువు తగ్గాలనుకునేవారికి రొయ్యలు మంచి ఆప్షన్. రొయ్యల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉంటాయి. రొయ్యల్లో అయోడిన్ కూడా ఉంటుంది. ఇది థైరాయిడ్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

రొయ్యలు మెదడు పనితీరును పెంచడంలో సాయపడతాయి. రొయ్యల్లో అస్టాక్సంతిన్ ఉంటుంది. ఇది కణాలు, మైటోకాండ్రియల్ పొరల స్థిరత్వాన్ని పెంచుతుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. మెదడు సంబంధిత వ్యాధుల్ని నివారించడంలో సాయపడుతుంది.

రొయ్యల్లో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షిస్తాయి. రొయ్యల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో సాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# 'అలియాస్ రుక్మిణీ' ప్రారంభం




నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గత ఏడాది 'కోర్ట్' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరో నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్ పతాకంపై రెండో ప్రయత్నంగా ఈ తాజా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకుడు. దీప్తి గంటా నిర్మాత. సోమవారం ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్‌నివ్వగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. ఇదొక అందమైన ప్రేమకథ అని, ప్రేక్షకులకు చాలాకాలం గుర్తుండిపోతుందని, త్వరలో షూటింగ్ ప్రారంభిస్తామని నాని తెలిపారు. "కోర్ట్' తర్వాత ఎన్నో కథలు విన్నాం. ఈ కథలో కొత్తదనం బాగా నచ్చింది. కథానాయకుడు కృష్ణ పాత్ర కోసం సరైన హీరోని వెతుకుతున్న టైంలో 'నితిన్ అన్నను అడుగుదాం' అని నాని సలహా ఇచ్చారు. కృష్ణ పాత్రకు నితిన్ పర్‌ఫెక్ట్‌గా సరిపోయారు' అని నిర్మాత దీప్తి గంటా చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: జోమోన్ టి జాన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: మురళీకాంత్ దేవసోత్.

# మంత్ర తంత్రాలకు అందని శక్తి



కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భానుచందర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన 'అగధ' చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఎం.ఎస్.రాజు దర్శకత్వం వహించారు. కాశీ విశాలాక్షి బలుసు నిర్మాత. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. హారర్, థ్రిల్లర్ అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్ సాగింది. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది. దాని గురించి నాకు తెలియాలి' 'అది ఒక మూఢనమ్మకమైతే కాదు. చీకటి లోకం నుంచి పుట్టుకొచ్చిన ఒక శక్తి' వంటి డైలాగ్స్ కథపై ఆసక్తినిరేకెత్తించేలా ఉన్నాయి.ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ 'వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా ఉన్నప్పటికీ..ఈ చిత్రాన్ని ఏడాదిలో పూర్తిచేశాం. యువతతో పాటు జెన్‌జీ వాళ్లని దృష్టిలో పెట్టుకొని ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాం. ఈ కథకు ఆర్టిస్టులందరూ పర్‌ఫెక్ట్‌గా కుదిరారు. ఈ సినిమా స్క్రీన్‌ప్లే అనూహ్య మలపులతో ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నారు. ఈ సినిమా వల్ల ఆధ్యాత్మికంగా తనలో చాలా మార్పులొచ్చాయని కథానాయిక కామాక్షి భాస్కర్ల తెలిపింది.

# అనంతపురం కుర్రాడిలోకి కొరియన్ ఆత్మ ప్రవేశిస్తే!



"థియేటర్లలో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించే సినిమా 'కొరియన్ కనకరాజు" అన్నారు దర్శకుడు మేర్లపాక గాంధీ. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ - రితికా నాయక్ జంటగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించాయి. ఇది ఈనెల 7న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు దర్శకుడు గాంధీ. "ఓ సారి అనంతపురంలోని కియా ఫ్యాక్టరీవైపు వెళ్లినప్పుడు అక్కడ చాలామంది కొరియన్లు పనిచేస్తున్నట్లు తెలిసింది. అలా మన తెలుగు గడ్డపై కొరియన్ కల్చర్ ఉండటం ఆసక్తి రేకెత్తించింది. ఈక్రమంలోనే అనంతపురం కుర్రాడిలోకి ఓ కొరియన్ ఆత్మ ప్రవేశిస్తే ఎలా ఉంటుందన్న కోణం నుంచి 'కొరియన్ కనకరాజు' కథాలోచన పుట్టింది". "ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే సినిమా. హారర్ అంశాల మేళవింపుతో ఉంటుంది. ఈ చిత్రాన్ని కొంత కొరియాలో చిత్రీకరించాం. చాలా ఖర్చు.. సవాల్‌తో కూడుకున్న షూట్ అది. అనుమతులు, వీసాల ప్రాసెస్ చాలా కష్టంగా సాగింది. అక్కడ ఓ 20రోజులు చిత్రీకరణ చేశాం".

"వరుణ్ తేజ్ దీంట్లోని కనకరాజు పాత్రకి.. అందులోకి వచ్చే కొరియన్ ఆత్మకు ఆయన నటన, పర్సనాలిటీ సరిగ్గా సరిపోతాయనిపించి ఈ పాత్రకి ఎంచుకున్నా. సినిమాలో ఆయనకి - సత్యకి మధ్య వచ్చే కామెడీ ట్రాక్ అందర్నీ కడుపుబ్బా నవ్విస్తుంది. ఈ సినిమా కోసం మేము కొరియా నుంచి ప్రత్యేకంగా ట్యూటర్‌ని తీసుకొచ్చాం. ఆయన నాయకానాయికలతో కొరియన్ డైలాగ్స్ ప్రాక్టీస్ చేయించారు. లొకేషన్లలో ఉండి ప్రాంప్టింగ్ ఇచ్చేవారు".

"మా నాన్న మేర్లపాక మురళి నవలా రచయిత. ఆయన రచనలన్నీ రొమాంటిక్ టచ్‌తో ఉంటాయి. నా బలమేమో కామెడీ. అందుకే నేనెప్పుడూ ఆయన కథలతో సినిమా చేయాలని అనుకోలేదు. నాకు కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కథలు రాసుకోవడమే సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం నా తదుపరి చిత్రం కోసం కథా చర్చలు జరుగుతున్నాయి".

# 'కరుప్పు' కోసం లోన్స్.. జ్యోతిక ధైర్యమే నన్ను నిలబెట్టింది: సూర్య



ఇటీవల 'కరుప్పు'తో విజయాన్ని అందుకున్నారు అగ్ర కథానాయకుడు సూర్య అయితే ఈ సినిమా సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అందించిన మద్దతును తాజాగా గుర్తు చేసుకున్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఈ అంశంపై మాట్లాడారు. "కరుప్ప సినిమా విడుదలకు ముందు చివరి నిమిషంలో ఆర్థిక పరమైన, పంపిణీ సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో సినిమాను థియేటర్లలో ప్రదర్శించడం కోసం అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. అది మా కుటుంబానికి పెద్ద రిస్క్. కానీ, జ్యోతిక నాపై ఉంచిన నమ్మకమే నేను ధైర్యంగా ముందడుగు వేసేలా చేసింది. ఆ రిస్క్ విషయంలో ఆమె నాకు కొండంత అండగా నిలిచింది" అని సూర్య పేర్కొన్నారు. దీనిపై ఇదే ఇంటర్వ్యూలో జ్యోతిక స్పందిస్తూ.. ఆ సినిమా విషయంలో పూర్తి ఘనత సూర్యకే చెందుతుందన్నారు. "నేను ఈ ప్రశంసను స్వీకరించను. మేము ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటాం. పిల్లల పెంపకం విషయంలోనూ మేమిద్దరం ఎప్పుడూ ఒకే అభిప్రాయంతో ఉంటాం. ముందు మేం చర్చించుకుని తర్వాత పిల్లలకు వివరిస్తాం" అని తెలిపారు. ఇక 'కరుప్ప' గురించి సూర్య మాట్లాడుతూ.. ఆర్.జే బాలాజీ ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రెండున్నర సంవత్సరాలు కష్టపడ్డారని అన్నారు. ఈ సినిమా విజయం చాలా మంది జీవితాలను మార్చేసిందని తెలిపారు. ఫైనాన్షియర్లు కూడా సహకరించారని వెల్లడించారు. సూర్య, త్రిష ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'కరుప్ప'ను.. మే 14న విడుదల చేయాలని చిత్రబృందం మొదట భావించింది. అయితే చివరి నిమిషంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల వల్ల సినిమా విడుదల ఒక రోజు ఆలస్యమైంది. ఆ సమయంలో సూర్య స్వయంగా పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చి సినిమా విడుదలకు మార్గం సుగమం చేశారని వార్తలు వచ్చాయి. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది.

# గాయాలతో బుమ్రా సతమతం.. గాబరా పడుతున్న టీమ్ఇండియా



జస్‌ప్రీత్ బుమ్రా.. ఈ పేసర్ బరిలోకి దిగుతున్నాడంటే ప్రత్యర్థి జట్ల బ్యాటర్ల గుండెల్లో గుబులు పుడుతుంది. స్వింగర్లు, యార్కర్లతో హడలెత్తించే పేస్ గుర్రాన్ని ఎదుర్కోవడానికి స్టార్ బ్యాటర్లు కూడా ఇబ్బందిపడతారు. ఇంతటి నాణ్యమైన బౌలర్ కీలకమైన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండట్లేదు. అందుకు కారణం అతను వరుసగా గాయాల బారినపడటం. ఈ ఏడాది ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా .. టీ20 ప్రపంచ కప్ ముగిశాక టీ20ల్లోనూ బరిలోకి దిగలేదు. ఐపీఎల్ తర్వాత నెలన్నరపాటు మైదానానికి దూరంగా ఉన్న అతను.. గత నెలలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌తో పునరాగమనం చేశాడు. అక్కడ రెండు మ్యాచ్‌లు ఆడి గాయం కారణంగా మూడో మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. 2016 జనవరిలో అరంగేట్రం చేసిన బుమ్రా ఇప్పటివరకు గాయం, ఫిట్‌నెస్ సమస్యలతో ఏయే మ్యాచ్‌లు, సిరీస్‌లకు దూరమయ్యాడో ఓ లుక్కేద్దాం.

2022 జులైలో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో వెన్నెముక గాయానికి గురైన జస్‌ప్రీత్ ఆ తర్వాత యూఏఈలో జరిగిన ఆసియా కప్‌నకు దూరమయ్యాడు.

ఆసియా కప్‌నకు దూరమైన బుమ్రా అదే ఏడాది సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగిన సిరీస్‌తో తిరిగి జట్టులోకి వచ్చాడు. అయితే, మళ్లీ వెన్నునొప్పి సమస్య తలెత్తడంతో 11 నెలలపాటు క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ స్టార్ పేసర్ అందుబాటులో లేని లోటు 2022 టీ20 ప్రపంచ కప్‌లో స్పష్టంగా కనిపించింది.


ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో 2022/23 బోర్డర్-గావస్కర్ ట్రోఫీ, తర్వాత జరిగిన ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అదే ఏడాది ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అందుబాటులో లేడు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 209 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.

2024-25 బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఐదో టెస్టులో బౌలింగ్ చేస్తున్నప్పుడు బుమ్రా గాయపడ్డాడు. ఆ గాయం నుంచి కోలుకుంటున్న తరుణంలో 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. కానీ, నడుము కింది భాగంలో గాయమవడంతో టోర్నీకి దూరమయ్యాడు.

ఇప్పుడు మోకాలి గాయం నుంచి అతడు ఇంకా కోలుకోకపోవడంతో శ్రీలంక పర్యటనకు దూరమవుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్, ఆ తర్వాత టీ20 ప్రపంచకప్, ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లు ఉన్నాయి. కాబట్టి.. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) బుమ్రా ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం, గాయాల నుంచి కోలుకునే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది.

# ద్రవిడ్‌లాగే రహానేకు ఎప్పుడూ గుర్తింపు దక్కలేదు: సునీల్ గవాస్కర్



ఇటీవల అన్ని ఫార్మాట క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు దక్కాల్సిన గుర్తింపు ఎప్పుడూ దక్కలేదని దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. "కెప్టెన్‌గా రహానేకు అద్భుతమైన రికార్డు ఉంది. అతను ఆరు టెస్టులకు సారథ్యం వహించగా.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ అద్భుతమైన విజయాలు నమోదైనప్పటికీ అతనికి దక్కా ల్సిన గుర్తింపు లభించలేదు. అలాగే రహానే నాయకత్వానికి కూడా పెద్దగా ప్రశంసలు దక్కలేదు. భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన బ్యాటర్లు లేదా బౌలర్లకే ప్రశంసలు దక్కుతాయి. కానీ జట్టు ఓడిపోయినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లే నిందలు మోయాల్సి వస్తుంది. 2021 ఆస్ట్రేలియా పర్యటనలో మొదటి టెస్టులో టీమ్ఇండియా కేవలం 36 పరుగులకే కుప్పకూలి తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. తదుపరి మ్యాచ్‌ల్లో కోచ్ రవిశాస్త్రితో కలిసి జట్టును ఆ పరిస్థితి నుంచి మెరుగైన స్థితికి చేర్చింది రహానేనే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి గెలుపుబాట పట్టించాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు అపూర్వమైన విజయాన్ని అందించడమే కాకుండా సిరీస్‌నూ సాధించిపెట్టాడు. నిజానికి ఆ సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు అగ్రశ్రేణి ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేరు. అయినప్పటికీ భారత్ తన టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప విజయాన్ని అందుకుంది. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# లుసానె డైమండ్ లీగ్ బరిలో నీరజ్ చోప్రా



ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 21న జరగనున్న లుసానె డైమండ్ లీగ్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ పోటీ పడాలంటే.. లుసానె టోర్నీ అతడికి అత్యంత కీలకం.

బ్రసెల్స్ వేదికగా సెప్టెంబరు 4-5 తేదీల్లో డైమండ్ లీగ్ ఫైనల్స్ జరగనున్నాయి. దీనికి నీరజ్ ఇంకా అర్హత సాధించలేదు. రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉన్న అతడు.. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 85.69 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ ఫైనల్ పాయింట్ల పట్టికలో నీరజ్ ఐదు పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే లుసానె లీగ్ లేదా ఆగస్టు 27న జరిగే జ్యూరిచ్ లీగ్‌లలో కనీసం ఒకదాంట్లోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. లుసానె పోటీల్లో రుమేశ్ తరంగ (శ్రీలంక), అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురుకా నుంది. కామన్వెల్త్ గేమ్స్ 2026లో స్వర్ణం లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ ఆఖరిదాకా గట్టిగానే పోరాడినా.. అతడికి రజత పతకమే (85.83 మీ) లభించింది. రుమేశ్ పతిరగె 89.75 మీటర్ల త్రో వేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945